
# శుభోదయం

ప్రతీ అక్షరం..ప్రజా సమరం......!

WWW.SUBHODAYAMDAILY.COM

అమరావతి,హైదరాబాద్, సంపుటి : 01, సంచిక : 342, పేజిలు : 08, ఎడిటర్ : వి. శ్రీనివాసరావు (6281773157) సోమవారం - 24 - ఫిబ్రవరి - 2025


## ఉపాధ్యాయ సంఘాలతో ఎమ్మెల్సీ అభ్యర్థి భేటీ



- ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ స్పష్టం చేశారు.
- రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలు తనకు మద్దతు తెలపడం చాలా సంతోషంగా ఉందన్నారు.
- ఆదివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కృష్ణా - గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆలపాటి రాజా పాల్గొన్నారు.

గుంటూరు : ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తానని కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయ సంఘాలు తనకు మద్దతు తెలపడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆదివారం ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో కృష్ణా - గుంటూరు జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆలపాటి రాజా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా మాట్లాడుతూ.. మిగతా 2లో

## రాష్ట్ర రైతాంగాన్ని ఎర్రబంగారం ఏడిపిస్తోంది

### రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఏపీలో మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందన్న షర్మిల

నష్టాల ఘాటుకు మిర్చి రైతు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడని ఆవేదన

కూటమి ప్రభుత్వం మిర్చి రైతుల కళ్లలో కారం కొడుతోందని ఆగ్రహం

ఏపీలో మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు.

రాష్ట్ర రైతాంగాన్ని ఎర్రబంగారం (మిర్చి) ఏడిపిస్తోందని, మిర్చి పంట నష్టాల ఘాటుకు రైతన్న ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.

పెట్టుబడి కూడా రాక క్వింటాకు రూ.15 వేల నష్టంతో అమ్ముకుంటుంటే... అండగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం మిర్చి రైతుల కళ్లలో కారం కొడుతోందని మండిపడ్డారు.

"మిర్చి రైతులకు రూ.11 వేల మద్దతు ధర ఇచ్చి ఉద్ధరించినట్టు కూటమి ప్రభుత్వం గప్పాలు కొడుతోంది.

ఎకరాకు లక్షన్నర పెట్టుబడి పెడితే, ఆ లక్షన్నర కూడా రావడంలేదని రైతులు కంటతడి పెడుతున్నారు.



విజయవాడ:ఏపీలో మిర్చి రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పేర్కొన్నారు. రాష్ట్ర రైతాంగాన్ని ఎర్రబంగారం (మిర్చి) ఏడిపిస్తోందని, మిర్చి పంట నష్టాల ఘాటుకు రైతన్న ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడి కూడా రాక క్వింటాకు రూ.15 వేల నష్టంతో అమ్ముకుంటుంటే... అండగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం మిర్చి రైతుల కళ్లలో కారం కొడుతోందని మండిపడ్డారు. "మిర్చి రైతులకు రూ.11 వేల మద్దతు ధర ఇచ్చి ఉద్ధరించినట్టు కూటమి ప్రభుత్వం గప్పాలు కొడుతోంది. ఎకరాకు లక్షన్నర పెట్టుబడి పెడితే, ఆ లక్షన్నర కూడా రావడంలేదని రైతులు కంటతడి పెడుతున్నారు. కౌలు రైతుకు మరో రూ.50 వేలు మిగతా 2లో

## 'ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం'



- ఆ సంస్థను వెంటనే రంగంలోకి దింపండి..
- చంద్రబాబు అధికారంలో ఉంటే కరవు వస్తుందని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు.
- గ్రూపు-2 పరీక్ష గందరగోళానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు.
- ఒకవైపు పరీక్ష వాయిదా వేయిస్తున్నామని చెప్పి.. మరో వైపు తమ చేతుల్లో లేదని చెప్పడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు.

విశాఖపట్నం: గ్రూపు-2 పరీక్ష గందరగోళానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. ఒకవైపు పరీక్ష వాయిదా వేయిస్తున్నామని చెప్పి.. మిగతా 2లో

## మరింతగా విషమించిన పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్యం



ఈ నెల 14 రోమ్‌లోని గెమిల్లీ ఆసుపత్రిలో చేరిన పోప్ ఫ్రాన్సిస్

శ్వాస తీసుకోవడంలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న పోప్

ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో రోమ్‌లోని గెమిల్లీ ఆసుపత్రిలో చేరిన మిగతా 2లో

## ఆరుగురు బందీలకు విముక్తి



కాల్పుల విరమణ ఒప్పందంపై నీలినీడలు కమ్ముకుంటున్న వేళ ముందుగా ప్రకటించిన విధంగానే హమాస్ తన చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీల్లో ఆరుగురిని వేర్వేరు ప్రాంతాల్లో రెడ్ క్రాస్‌కు అప్పగించింది.

నుసెయిరత్: కాల్పుల విరమణ ఒప్పందంపై నీలినీడలు కమ్ముకుంటున్న వేళ ముందుగా ప్రకటించిన విధంగానే హమాస్ తన చెరలో ఉన్న ఇజ్రాయెల్ బందీల్లో ఆరుగురిని మిగతా 2లో

## ట్రంప్‌కు కెనడా పీఎం ట్రూడో కౌంటర్



కెనడాను అమెరికాలో కలిపేసుకుంటామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చేస్తున్న కామెంట్లకు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కౌంటర్ ఇచ్చారు.

ఒట్టావా: కెనడాను అమెరికాలో కలిపేసుకుంటామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదేపదే చేస్తున్న కామెంట్లకు కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కౌంటర్ ఇచ్చారు. మిగతా 2లో

## సీఎం రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తున్నా

### రాష్ట్రంలో రాహుల్ ట్యాక్స్

హైదరాబాద్ స్థిరాస్తి వ్యాపారుల్లో భయం

2 లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయి?: కిషన్‌రెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికల్లో మూడు స్థానాలు గెలుస్తామని.. సీఎం రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తున్నానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు.

హామీలు అమలుకు ప్రణాళిక, కార్యాచరణ ప్రకటిస్తే చర్చకు సిద్ధమన్నారు.

దేనికి చర్చకు రావాలో సీఎం రేవంత్ స్పష్టం చేయాలని కిషన్‌రెడ్డి అన్నారు.



నిజామాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిగతా 2లో

## చంద్రబాబు కియా తెచ్చారు... లోకేశ్ టెస్లా తెస్తారు



త్వరలో భారత్ లోకి టెస్లా ఎంట్రీ

ఉద్యోగులను నియమించుకుంటున్న ఈవీ కంపెనీ

కియా మనది... టెస్లా కూడా మనదే అంటూ వాసంశెట్టి సుభాష్ ట్వీట్

ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన ప్రముఖ విద్యుత్ మిగతా 2లో

## వైఎస్ జగన్.. భయమా.. మార్పా..

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు.

ఇప్పటి వరకు జరుగుతున్న చర్చ ఏంటంటే.. వరుసగా 60 పనిదినాలు శాసనసభకు హాజరుకాకపోతే ఆ సభ్యుడి సభ్యత్వం రద్దువుతుంది.

ఏ సభ్యుడైనా 60 పనిదినాలు సభకు రాకపోతే అతనిపై వేటు వేసేందుకు అసెంబ్లీ స్పీకర్ సీరియస్ గా ఉన్నట్లు సమాచారం.



అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి సోమవారం నుంచి జరగనున్న అసెంబ్లీ సమావేశాలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. అయితే ఇప్పటి వరకు జరుగుతున్న చర్చ ఏంటంటే.. వరుసగా 60 పనిదినాలు శాసనసభకు హాజరుకాకపోతే ఆ సభ్యుడి సభ్యత్వం రద్దువుతుంది. ఏ సభ్యుడైనా 60 పనిదినాలు సభకు రాకపోతే అతనిపై వేటు వేసేందుకు అసెంబ్లీ స్పీకర్ సీరియస్ గా ఉన్నట్లు సమాచారం. ఇదే విషయం డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు చాలా సందర్భాల్లో చెప్పారు. మిగతా 2లో

## ఆ విషయాలు గుర్తుకు తెచ్చుకుని బండి సంజయ్ ఎమోషనల్



- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రజల పక్షాన, ఉపాధ్యాయుల కోసం ఏనాడైనా ఉద్యమాలు చేశారా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు.
- తాము ప్రజల కోసం ఉద్యమాలు చేశాం, లాఠీ దెబ్బలు తిన్నామని గుర్తుచేశారు. అయినా బీజేపీకి ప్రజలు ఓట్లు వేయలేదు... ఎన్నికల్లో గెలిపించలేదని చెప్పారు.

## కేంద్రాన్ని గట్టిగా ప్రశ్నిస్తే ఉద్యోగం పోతుందని రేవంత్ రెడ్డికి భయం

### కృష్ణా జలాల విషయంలో ఉత్తరం రాసి చేతులు దులిపేసుకున్నారని విమర్శ

కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా కోసం కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా ప్రశ్నిస్తే తన ఉద్యోగం పోతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భయపడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు.

కృష్ణా జలాల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి కేవలం ఉత్తరం రాసి చేతులు దులిపేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ఎండగడతామని ఆయన అన్నారు.

గతంలో కేసీఆర్ నల్గొండలో ధర్నా చేసిన తర్వాతనే అసెంబ్లీలో ఈ అంశంపై తీర్మానం చేశారని గుర్తు చేశారు.

రేవంత్ రెడ్డి 'ఆర్' ట్యాక్స్‌పై చర్యలు తీసుకోవాలని కేటీఆర్ సవాల్

రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు కాపాడుతోందని ప్రశ్న

దివ్యంగా ఉన్న రాష్ట్రాన్ని దివాలా తీయించారు: కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజం

సీఎం అసమర్థతతో ఆర్థిక లోటు గరిష్ట స్థాయికి చేరిందని మండిపాటు



హైదరాబాద్: కృష్ణా జలాల్లో న్యాయమైన వాటా కోసం కేంద్ర ప్రభుత్వాన్ని మిగతా 2లో

## ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం



ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో జరిగిన ప్రమాదానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు.

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పనులు జరిగినా ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదని గుర్తు చేశారు.హడావిడిగా పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకుండా టార్గెట్‌తో ఒత్తిడి పెట్టి పని చేయించడంతోనే ప్రమాదం జరిగినట్లు ఆరోపించారు.

కొల్లాపూర్ : ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో మిగతా 2లో

శుభోదయం

సోమవారం - 24 - ఫిబ్రవరి - 2025

# రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

అదనంగా నష్టం అంటూ అల్లాడుతున్నారు. రాష్ట్ర రైతులపై కేంద్రానికి నిజంగా ప్రేమే ఉంటే మిర్చి కనీస ధరను రూ.26 వేలుగా ప్రకటించాలి. లేకపోతే, మిర్చి రైతును ఆదుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ధరల స్థిరీకరణ నిధి వెంటనే అమలు చేయాలి. కేంద్రం ఇచ్చే ధరకు తోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా మిర్చి రైతుకు బోనస్ ప్రకటించాలి. ఓవైపు మిర్చి రైతు విలవిల్లాడుతుంటే, మరోవైపు టమాటా రైతులకు తీరని కష్టాలు వచ్చిపడ్డాయి. గిట్టుబాటు ధర లేక, కనీసం పెట్టుబడి ఖర్చులు కూడా రాక రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్లో టమాటా కిలో రూ.15 పలుకుతుంటే... రైతుకు కిలో మీద మూడ్నాలుగు రూపాయలు కూడా రావడంలేదు. వెంటనే టమాటా రైతులను కూడా ప్రభుత్వం ఆదుకోవాలి. టమాటా ధరలు పడిపోకుండా తగిన చర్యలు తీసుకోవాలి" అంటూ షర్మిల డిమాండ్ చేశారు. రాష్ట్ర రైతాంగాన్ని ఎర్రబంగారం ఏడిపిస్తోందని ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. మిర్చి పంట నష్టాల ఘాటుకు రైతన్న ఉక్కిరిబిక్కిరి అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడికి పెట్టిన పైసలు రాక అడ్డికి పావుషేరు కింద అమ్ముకుంటూ రైతు కన్నీళ్లు పెడుతున్నారని చెప్పారు. క్వింటాకు రూ. 15 వేల నష్టంతో అమ్ముకుంటుంటే.. అండగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం .. మిర్చి రైతుల కళ్లలో కారం కొడుతుందని ఆరోపించారు. ఇవాళ(ఆదివారం) విజయవాడలోని కాంగ్రెస్ కార్యాలయంలో షర్మిల మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీడియాతో షర్మిల మాట్లాడారు. మిర్చి రైతులకు రూ.11 వేల మద్దతు ధర ఇచ్చి ఉద్ధరించినట్లు .. కూటమి ప్రభుత్వం గప్ఫాలు కొడుతుందని వైఎస్ షర్మిల చెప్పారు.ఎకరాకు లక్షన్నర పెట్టుబడి పెడితే వచ్చే ఆదాయం .. లక్షన్నర లేదని రైతులు కంటతడి పెడుతున్నారని వాపోయారు. కౌలు రైతుకు అదనంగా రూ.50 వేలకు నష్టమే అంటూ అల్లాడుతున్నారని చెప్పారు. నిజంగా రాష్ట్ర రైతులపై కేంద్రానికి ప్రేమనే ఉంటే.. వెంటనే మిర్చి పంటకు కనీస మద్దతు ధర రూ.26 వేలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే నష్టపోతున్న మిర్చి రైతును ఆదుకొనేలా.. ధరల స్థిరీకరణ నిధిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. కేంద్రం ఇచ్చే ధరతో పాటు రాష్ట్ర ప్రభుత్వం మిర్చి రైతుకు బోనస్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మిర్చి రైతు విలవిల లాడుతుంటే టమాట సాగు చేస్తున్న రైతులకు తీరని కష్టాలు వచ్చి పడ్డాయని వైఎస్ షర్మిల అన్నారు.గిట్టుబాటు ధర, కనీసం పెట్టుబడి రాక, రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ధరలు పడిపోవటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని చెప్పారు. మార్కెట్‌లో కేజీ టమాట రూ.15లు పలుకుతుంటే .. రైతుకు కిలో రూ. 3 నుంచి రూ. 4లు కూడా దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరాకు రెండున్నర లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన చోట రూ. 50 వేలు కూడా ఆదాయం లేదంటే .. టమాటా రైతుకు ఎంత అన్యాయం జరుగుతుందో అర్థం అవుతుందని తెలిపారు. వెంటనే టమాటా రైతును ఆదుకోవాలని, టమాటా ధరలు పడిపోకుండా తగు చర్యలు తీసుకోవాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ప్రభుత్వం చిత్తశుద్ధితో సర్వే చేపట్టిందని, ప్రత్యేకంగా మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి, చట్టపరంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక శాఖకు అప్పగించి పకడ్బందీగా నిర్వహించినట్లు వివరించారు. దేశంలోని ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా ఇలాంటి సాహసం చేయలేదని, సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై కొందరు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. వ్యవస్థను కుప్పకూల్చే కుట్రలో భాగంగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. శనివారం ప్రజాభవన్‌లో బీసీ నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. సర్వే చేపట్టిన విధానం, ఫలితాలు, బీసీల జనాభాకు సంబంధించిన అంశాలను ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్‌తోపాటు పలువురు బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. సమగ్ర సర్వే, బీసీ జనాభా, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు.

కేసీఆర్ ఎన్నికల కోసం వాడుకున్నారు

'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేస్తామని రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. ఆయన ఇచ్చిన మాటకు కట్టుబడి సర్వే చేపట్టాం. అన్ని రంగాల్లో బీసీలకు సామాజిక న్యాయం జరగాలంటే కులగణన చేయాల్సిందే. కేసీఆర్ చేసిన సకలజనుల సర్వే తప్పుల తడకగా ఉన్నందునే ఆ లెక్కలను బయటపెట్టలేదుం. వాటిని ఆయన ఎన్నికల కోసం వాడుకున్నారు.. ప్రజల కోసం వాడలేదు. ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో సర్వే ప్రక్రియ చేపట్టింది. ఇంటింటికి ఎన్యుమరేటర్లు వెళ్లి సమాచారం సేకరించారు. ఆ సమాచారాన్ని తప్పులు దొర్లకుండా ఎన్యుమరేటర్ సమక్షంలో కంప్యూటరీకరించారు. తప్పులు జరిగాయని మాట్లాడుతున్న వారు ఎక్కడ తప్పు జరిగిందో నిరూపించాలి. అర్థంలేని ఆరోపణలు పట్టించుకోవాల్సిన పనిలేదు. కేసీఆర్ చేసిన సర్వే ప్రకారం బీసీలు 51 శాతం ఉంటే.. సమగ్ర ఇంటింటి సర్వే ప్రకారం బీసీ జనాభా 56.33 శాతం ఉంది. బీసీల లెక్క తగ్గిందా? పెరిగిందా? అనే విషయాన్ని బీసీలు గమనించాలి' అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

ఒకట్రెండు ఆధిపత్యవర్గాల కోసం...

జనగణనలో కులగణన చేపట్టాలనే డిమాండ్ ఎప్పట్నుంచో ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

# కేంద్రాన్ని గట్టిగా ప్రశ్నిస్తే ఉద్యోగం పోతుందని రేవంత్ రెడ్డికి భయం

గట్టిగా ప్రశ్నిస్తే తన ఉద్యోగం పోతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భయపడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కృష్ణా జలాల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి కేవలం ఉత్తరం రాసి చేతులు దులిపేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని అసెంబ్లీలో ఎండగడతామని ఆయన అన్నారు. గతంలో కేసీఆర్ నల్గొండలో ధర్నా చేసిన తర్వాతనే అసెంబ్లీలో ఈ అంశంపై తీర్మానం చేశారని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి తెలంగాణలో 'ఆర్' ట్యాక్స్ వసూలు చేస్తున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారని, కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌కి చేతనైతే 'ఆర్' ట్యాక్స్‌పై చర్యలు తీసుకోవాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమాలపై కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినా చర్యలు లేవని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు కాపాడుతోందని ప్రశ్నించారు. ఆయన బీజేపీలో చేరతారని లోపాయికారి ఒప్పందం ఏమైనా ఉందా? అని నిలదీశారు. అమృత్ టెండర్లలో ముఖ్యమంత్రి బావమరిది అక్రమాలకు పాల్పడ్డాడని, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై ఈడీ దాడులు చేసిందని, అయినప్పటికీ చర్యలు లేవని విమర్శించారు. సుంకిశాల ప్రమాదంలో కూడా రేవంత్ రెడ్డి ఎవరిని కాపాడుతున్నారో తెలుసని కేటీఆర్ అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో దివ్యంగా ఉన్న రాష్ట్రం 15 నెలల కాంగ్రెస్ పాలనలో దివాలా తీసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారక రామారావు మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి అసమర్థతతో రాష్ట్ర ఆర్థికలోటు గరిష్ట స్థాయికి చేరిందని విమర్శించారు. తిక్క నిర్ణయాలు, హైడ్రా లాంటి దిక్కుమాలిన విధానాలతో రాష్ట్ర ఆదాయం పూర్తిగా పడిపోయిందని దుయ్యబట్టారు. తన చేతగానితనంతో కేవలం ఒక్క ఏడాదిలోనే అన్ని రంగాలనూ సీఎం చావుదెబ్బ కొట్టాడని వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, బీరం హర్షవర్ధన్‌రెడ్డి, డాక్టర్ మెతుకు ఆనంద్, పట్నం నరేందర్‌రెడ్డితో కలిసి కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'అధికారంలోకి వచ్చినప్పటి నుంచే కాంగ్రెస్ నేతలు రాష్ట్ర ఆర్థిక ప్రగతిపై ఒక ఎజెండా ప్రకారం అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. తల్లి లాంటి రాష్ట్రాన్ని కేన్సర్‌తో పోల్చిన దుర్మార్గుడు రేవంత్‌రెడ్డి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తెలుసుకోకుండా ఇష్టారీతిన వ్యాఖ్యలు చేస్తూ తెలంగాణ పరువు తీస్తున్నాడు. రేవంత్‌రెడ్డి అబద్ధాలను బట్టబయలు చేస్తూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇటీవల తెలంగాణ స్టేట్ స్టాటిస్టికల్ అబ్‌స్ట్రాక్ట్‌ను విడుదల చేశారు. సీఎం చెబుతున్న అబద్ధాలను తిప్పికొడుతూ సమగ్ర నివేదిక ద్వారా వాస్తవాలు బయట పెట్టారు. మాజీ సీఎం కేసీఆర్‌కు మంచిపేరు వస్తుందనే భయంతో వెబ్‌సైట్ నుంచి ఈ నివేదికను ప్రభుత్వం తొలగించింది'అని కేటీఆర్ ఆరోపించారు.

## ఆరు గ్యారంటీలు అమలు చేసిన చోటే కాంగ్రెస్ పోటీ చేయాలి

సీఎం రేవంత్ రంకెలు వేయడం మాని పాలనపై అసెంబ్లీలో చర్చ పెట్టాలని కేటీఆర్ హితవు పలికారు. ఆరు గ్యారంటీలు అమలు చేసిన చోటే కాంగ్రెస్ పోటీ చేసి కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తామన్న చోటే సీఎం ఓట్లు అడగాలని సూచించారు. 'రాబోయే రోజుల్లో రేవంత్ ఆడబిడ్డల పుస్తెల తాడు కూడా ఎత్తుకుపోతాడు. కేంద్ర మంత్రి బండి సంజయ్ రక్షణలో రేవంత్ ఉన్నాడు. రేవంత్, బండి సంజయ్‌ను ఆర్ఎస్ బ్రదర్స్ అనుకుంటున్నారు. బిల్డర్ల నుంచి చదరపు అడుగుకు రూ.150 వసూలు చేస్తున్న రేవంత్ ప్రభుత్వం 'ఆర్ఆర్ టాక్స్'విధిస్తోందని గతంలో ప్రధాని ఆరోపించారు. రేవంత్ ప్రభుత్వాన్ని బీజేపీ ఎందుకు కాపాడుతోందో చెప్పాలి. బీజేపీలో చేరేందుకు రేవంత్ లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నారా? సుంకిశాల ప్రమాదంలో రేవంత్ ఎవరిని కాపాడుతున్నారో తెలుసు. కృష్ణా జలాల్లో తెలంగాణకు రావాల్సిన న్యాయమైన వాటా కోసం డిమాండ్ చేస్తే ఉద్యోగం పోతుందని సీఎం భయపడుతున్నాడు. కృష్ణా జలాల దోపిడీ జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును అసెంబ్లీ వేదికగా ఎండగడతాం. తెలంగాణను ఎవరు తక్కువ చేసి దూషించినా అదే స్థాయిలో సమాధానం ఇస్తాం'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

# సీఎం రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తున్నా

మూడు స్థానాలు గెలుస్తామని.. సీఎం రేవంత్ సవాల్‌ను స్వీకరిస్తున్నానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. హామీలు అమలుకు ప్రణాళిక, కార్యాచరణ ప్రకటిస్తే చర్చకు సిద్ధమన్నారు. ఏ ఒక్క హామీకి కనీసం కార్యచరణ కూడా లేదు. చర్చకు రమ్మనడం హాస్యాస్పదం. దేనికి చర్చకు రావాలో సీఎం రేవంత్ స్పష్టం చేయాలని కిషన్‌రెడ్డి అన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలోచించి ఓటేయాలి. బీజేపీని ఆదరించాలి. బీఆర్ఎస్ పాలనలో శాసన మండలి ప్రాధాన్యత తగ్గింది. ఎన్నికల్లో పసుపు బోర్డు ప్రభావం ఉంటుంది. కులగణనకు బీజేపీ వ్యతిరేకం కాదు. రిజర్వేషన్‌లను స్వాగతిస్తాం. ముస్లింలను బీసీ జాబితాలో చేరిస్తే వ్యతిరేకిస్తాం. బీజేపీ తో బీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధాలు లేవు. కాంగ్రెస్‌తో కలిసేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోంది. గతంలో అనేక సార్లు బీఆర్ఎస్ కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చింది. జిల్లా అధ్యక్షుల నియామకాల ప్రక్రియ తర్వాతే రాష్ట్ర అధ్యక్షుని ఎంపిక" ఉంటుందని కిషన్‌రెడ్డి తెలిపారు. 14 నెలల్లో కాంగ్రెస్ ప్రజలకు ఓరగబెట్టింది ఏమీ లేదు. అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చారు. బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు శాసన మండలి ప్రాధాన్యతను తగ్గించాయి. ప్రజా సమస్యల పోరాటానికి శాసన మండలి వేదిక. కుల గణనకు బీజేపీ వ్యతిరేకం కాదు. ముస్లింలను బీసీ లో చేర్చే కుట్ర జరుగుతుంది. దానికి వ్యతిరేకం" అని కిషన్‌రెడ్డి చెప్పారు.తెలంగాణను పదేళ్ల పాటు బీఆర్ఎస్ దోచుకుందని ప్రజలు కాంగ్రెసకు అవకాశం ఇస్తే.. ఆ పార్టీ రాష్ట్రంలో రాహుల్ గాంధీ ట్యాక్స్‌ను విధిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారులు భయపడే పరిస్థితి ఉందన్నారు. శనివారం నిర్మల్ జిల్లాలోని భైంసా, ఖానాపూర్‌లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో.. అదేవిధంగా నిజామాబాద్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. అధికారంలోకి రాగానే 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏమైందని కిషన్‌రెడ్డి ప్రశ్నించారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోరారు.స్థానిక ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేక.. ఏదో ఒక వంకతో వాయిదా వేసేందుకు సీఎం రేవంత్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పాలనపై నమ్మకం ఉంటే పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ.. సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ చేశారు. శనివారం హనుమకొండ జిల్లా కార్యాలయంలో అరుణ మీడియాతో మాట్లాడారు.

సీఈవోకు బీజేపీ ఫిర్యాదు

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ న్యూస్‌టుడే సంస్థ తమపై దుష్ప్రచారం చే స్తున్నాయని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి(సీఈవో)కి బీజేపీ శనివారం ఫిర్యాదు చేసింది.

# వైఎస్ జగన్.. భయమా.. మార్పా..

ఈ పరిస్థితుల్లో జగన్ తన ఎమ్మెల్యేలతోపాటు అసెంబ్లీ సమావేశాలకు వెళ్లాలని నిర్ణయించినట్లు తెలియవచ్చింది. ఆయన కేవలం అటెండెంట్ కోసం మొక్కుబడిగా వెళతారా.. ఎందుకంటే ఒక రోజు వెళితే మళ్లీ 60 రోజుల వరకు వెళ్లనవసరం లేదు. ఈ క్రమంలో ఒక రోజు వెళ్లి పబ్బం గడుకుని వచ్చేస్తారా.. లేదా ప్రజల కోసం సభలో మాట్లాడదామని నిర్ణయించుకున్నారా.. కొంతమంది ఏమంటున్నారంటే.. జగన్మోహన్ రెడ్డి భయపడ్డారని.. లేదు.. జగన్ మారారని మరికొంతమంది అంటున్నారు. అతనిలో 'భయమా.. మార్పా'.. అయితే భయమేనని అంటున్నారు. ఎందుకంటే రాజ్యాంగంలోని 101లో క్లాజ్ 4 ఏం చెబుతుందంటే.. ఏ సభ్యుడైనా వరుసగా 60 రోజులు సభకు హాజరుకాకపోతే ఆ సభ్యుడిని డిస్‌క్వాలిఫై చేసే అధికారం సభాపతికి ఉంటుంది. స్పీకర్ డిక్లేర్ చేసిన తర్వాత ఎన్నికల కమిషన్‌కు పంపితే ఆటోమేటిక్‌గా డిస్ క్వాలిఫై అవుతుంది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 4లో ఉంది. ఇది జరుగుతుందనే భయంతోనే జగన్ అసెంబ్లీకి రావాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.కాగా ప్రతిపక్షనేత హోదా ఇస్తేనే శాసనసభ సమావేశాలకు హాజరవుతానని ఇన్నాళ్లూ భీష్మించిన వైసీపీ అధ్యక్షుడు, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్ ఎట్టకేలకు మెట్టు దిగారు. సోమవారం నుంచి మొదలవుతున్న 2025-26 వార్షిక బడ్జెట్ సమావేశాలకు తన ఎమ్మెల్యేలతో కలిసి ఆయన హాజరు కానున్నారు. తొలిరోజు సభలో జరిగే గవర్నర్ ప్రసంగానికి వీరంతా హాజరవ్వనున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జగన్ పార్టీకి 11 సీట్లు లభించిన విషయం తెలిసిందే. దానివల్ల ప్రతిపక్ష హోదాను జగన్ కోల్పోయారు. అయినా, విపక్ష హోదా కోసం ఇన్నాళ్లుగా ఆయన వాదిస్తూనే ఉన్నారు. న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి, అసెంబ్లీలో ప్రమాణ స్వీకారం చేసినప్పటినుంచీ జగన్, ఆయన పార్టీ ఎమ్మెల్యేలు సభకు వెళ్లడంలేదు. అసెంబ్లీ సమావేశాల సమయంలో తాను వైసీపీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించి ప్రభుత్వంపై సంధించే ప్రశ్నలకు .. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి, మంత్రులు సమాధానం చెప్పాలని ఇటీవల జగన్ హూంకరించారు. ఈ క్రమంలో అసెంబ్లీ నిబంధనల ప్రకారం వరుసగా అరవై రోజులు ఏ కారణం లేకుండా, సమాచారం ఇవ్వకుండా నిరవధికంగా సభకు గైర్హాజరు అయితే సభ్యుల సభ్యత్వం రద్దవుతుందని సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఉపసభాపతి రఘురామకృష్ణరాజు అధికారికంగానే స్పష్టం చేశారు. శాసనసభకు హాజరుకాకపోతే .. సభ్యత్వం రద్దయితే .. ఉప ఎన్నికలను ఎదుర్కోనాల్సి వస్తుందని జగన్ భావించారోఏమోగానీ... అనూహ్యంగా వెనక్కి తగ్గారు.శాసనసభా సమావేశాలకు హాజరవుదామంటూ శనివారం జగన్‌కు శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ సూచించినట్టు తెలిసింది. ఇందుకు జగన్ తలూపారు. అయితే.. శాసనసభా సమావేశాలకు ఎంతకాలం జగన్, ఆయన ఎమ్మెల్యేలు హాజరవుతారనేది మాత్రం స్పష్టత లేదు. శాసనసభలో గవర్నర్ ప్రసంగం తర్వాత వేరే కార్యకలాపాలు లేకుండానే సభ ఆ రోజుకు వాయిదా పడుతుంది. తిరిగి మంగళవారం సమావేశమవుతుంది. మరి... జగన్, ఎమ్మెల్యేలు తొలి రోజు మాత్రమే వస్తారా? లేక బడ్జెట్ సమావేశాలు పూర్తయ్యేవరకు కొనసాగుతారా అనేది తెలియాల్సి ఉంది. కాగా, కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలు తీరును శాసనసభలో నిలదీస్తామంటూ సోషల్ మీడియాలో వైసీపీ ప్రచారం చేసుకుంటోంది. కాగా.. ఆదివారం బెంగళూరు నుంచి తాడేపల్లికి జగన్ చేరుకుంటారు. ఆ వెంటనే, అందుబాటులో ఉన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్యనేతలతో ఆయన సమావేశమవుతారు. ఈ సమావేశంలో అసెంబ్లీకి ఎన్ని రోజులు హాజరయ్యేదీ ఆయన స్పష్టతను ఇస్తారని వైసీపీ ముఖ్యనేతలు చెబుతున్నారు.

# 'ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం'

మరో వైపు తమ చేతుల్లో లేదని చెప్పడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనుమన్నారు. 'అభ్యర్థుల అభ్యంతరాలను పరిగణనులోకి తీసుకుంటున్నట్టు విద్యా శాఖ మంత్రి లోకేశ్ శుక్రవారం ట్వీట్ చేశారు. తాము వాయిదా వేయుమనే చెప్పామంటూ సీఎం పేరుతో సర్క్యులేట్ అవుతున్న ఆడియోను ప్రజలంతా విన్నారు. గ్రూప్%-%2 పరీక్ష వాయిదా అంటూ వార్తలు వేసిన ఛానెళ్ల మీద కేసులు పెట్టారు.ఇంత అయోమయం, గందరగోళం ఉన్న ప్రభుత్వాన్ని నేనెప్పుడూ చూడలేదు. చివరిదాకా వాయిదా వేస్తున్నామని నమ్మించి ఈ ప్రభుత్వం గ్రూప్%-%2 అభ్యర్థులను మోసం చేసింది. ప్రభుత్వ వైఖరిని, ఆందోళన చేస్తున్న అభ్యర్థులపై పోలీసుల లాఠీఛార్జీని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇంతటి గందరగోళం మధ్య పరీక్ష నిర్వహణ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదయోగ్యం కాదు. సీఎం వెంటనే దీనిపై అత్యవసర సమావేశం నిర్వహించి పరీక్ష వాయిదా వేయాలి. అభ్యర్థుల ఆందోళనపై స్పష్టతనిచ్చిన తర్వాత పరీక్ష నిర్వహించాలి' అని పేర్కొన్నారు. చంద్రబాబు అధికారంలో ఉంటే కరవు వస్తుందని మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు.మిర్చి రైతుల సమస్యలపై ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్‌పాలనపై గుర్తు చేస్తూ ప్రభుత్వంపై విమర్శలు కురిపించారు.2021లో మిర్చి రైతులకు జగన్ ప్రభుత్వం రూ.7 వేలు మద్దతు ప్రకటించిందని గుర్తు చేశారు. రైతు నష్టపోకుండా చేసిన ఘనత తమ ప్రభుత్వానిదని చెప్పారు. 2021లో మిర్చి రైతుల పెట్టుబడి రూ. 75 వేలు నుంచి లక్షల వరకు ఉండేదని, ప్రస్తుతం రూ. 1.50 వేల నుంచి రూ. 2 లక్షల వరకూ ఉందని తెలిపారు. ప్రస్తుతం మిర్చి పంట చాలా చోట్ల దిగుబడి తగ్గిందని, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకూ మిర్చి పంటకు ప్రభుత్వం ఎందుకు మద్దతు ధర ప్రకటించలేదని ప్రశ్నించారు. ఆనాడు జగన్ రైతుల పక్షాన నిలబడి, మద్దతు కల్పించే విధంగా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. మార్క్ ఫెడు రంగంలోకి దింపి చాలా ఉత్పత్తులను కొనుగోలు చేశామన్నారు. ధాన్యం కొనుగోలు విధానంలో రూ.65 వేల కోట్లు వెచ్చిచామని చెప్పారు. ఇతర పంటలకు రూ.7,800 కోట్లు కేటాయించామని పేర్కొన్నారు. ధరల స్థిరీకరణకు రూ.3 వేల కోట్లు ఇచ్చామన్నారు. జగవరి నెలలో హార్టికల్చర్ అధికారులు నివేదిక ఇస్తే చంద్రబాబు పక్కన పెట్టేశారని అంబటి ఆరోపించా.మిర్చి ధర పడిపోయిందని, కేంద్రం కలుగజేసుకోవాలని కేంద్రాన్ని చంద్రబాబు అడగటంపై మాజీ మంత్రి అంబటి రాంబాబు అభ్యంతరం వ్యక్తం చేశారు. మిర్చి కొనుగోలులో కేంద్ర ప్రభుత్వానికి ఏం సంబంధమని ఆయన ప్రశ్నించారు. మిర్చి కొనుగోలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని నిలదీశారు.

# మరింతగా విషమించిన పోప్ ఫ్రాన్సిస్ ఆరోగ్యం



పోప్ ఫ్రాన్సిస్ (88) ఆరోగ్యం మరింత విషమించింది. ఈ నెల 14 నుంచి ఆయనకు చికిత్స కొనసాగుతోంది. శ్వాస తీసుకోవడంలో నిన్న మరింతగా ఇబ్బంది పడ్డారు. దీంతో అధిక పీడనంతో (హై ఫ్లో) ఆక్సిజన్ అందిస్తున్నారు. ఎనీమియా సంబంధిత సమస్యను గుర్తించిన వైద్యులు రక్తాన్ని కూడా మార్చారు. శుక్రవారం కంటే శనివారం మరింత కష్టంగా గడిచిందని, ఈ సమయంలో ఏమీ చెప్పలేమని వాటికన్ ఒక ప్రకటనలో పేర్కొంది. పోప్ న్యూమోనియాతోపాటు తీవ్రమైన శ్వాసకోశ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నారని వైద్యులు తెలిపారు. మరో వారం రోజులపాటు ఆసుపత్రిలో ఉండాల్సి వస్తుందని పేర్కొన్నారు. మరోవైపు, ప్రమాదం నుంచి పోప్ బయటపడలేదని ఆయన వ్యక్తిగత ఫిజీషియన్ లూగీ కార్బోన్ తెలిపారు. అర్జెంటినా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో 1936లో జన్మించిన పోప్ అసలు పేరు జార్జ్ మారియో బెర్గోగ్లియో. 2013లో నాటి పోప్ బెనెడిక్ట్-16 రాజీనామా చేయడంతో ఫ్రాన్సిస్ కేథలిక్ చర్చి అధిపతి అయ్యారు. కాగా, దక్షిణార్థ గోళం నుంచి పోప్ అయిన తొలి వ్యక్తిగా ఆయన రికార్డులకెక్కారు.

# ఆరుగురు బందీలకు విముక్తి




వేర్వేరు ప్రాంతాల్లో శనివారం రెడ్ క్రాస్‌కు అప్పగించింది. గాజాలోని నుసెయిరత్‌లో శనివారం ఉదయం ముందుగా ఏర్పాటు చేసిన వేదికపైకి మాస్క్ ధరించిన హమాస్ సాయు ధులు ముగ్గురు బందీలను తీసుకువచ్చారు. వీరు ఒమెర్ వెన్‌కెర్ట్(23), ఒమెర్ షెమ్ టోవ్(22), ఎలియా కోహెన్(27). ముగ్గురూ ఆరోగ్యంగానే కనిపించారు. ఎంతో సంతోషంతో ఉన్న ఒమెర్ షెమ్ టోవ్ పక్కనున్న హమాస్ మిలిటెంట్ నుదుటిపై ముద్దిచ్చాడు. వీరి విడుదలను గమనిస్తున్న కుటుంబసభ్యులు ఆనంద బాష్పాలతో సంతోషం పట్టలేక కేకలు వేశారు. అనంతరం వీరిని రెడ్ క్రాస్ వాహనాల్లో ఇజ్రాయెల్ సరిహద్దుల్లోకి తీసుకెళ్లారు. అక్కడ వీరికి అధికారులు స్వాగతం పలికారు. అంతకుముందు, గాజాలోని రఫాలో జరిగిన కార్యక్రమంలో టల్ షోహమ్(40), అవెరా మెంగిస్టు(38) అనే బందీలను హమాస్ సాయుధులు రెడ్ క్రాస్ సిబ్బందికి అప్పగించారు. ఇక, ఆరో బందీ 36 ఏళ్ల బెడోయిన్ సంచార తెగకు చెందిన హిషామ్ అల్%-% సయేద్‌ను కూడా విడిచిపెట్టింది. మానసిక సమస్యలతో బాధపడుతున్న ఇతడు 2015లో గాజాలోకి ప్రవేశించి, హమాస్ బందీగా మారాడు.

# ట్రంప్‌కు కెనడా పీఎం ట్రూడో కౌంటర్



బోస్టన్‌లో జరిగిన హాకీ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి అమెరికాను ఓడించిన తర్వాత కెనడా ప్రధాని ఎక్స్(ట్విటర్)లో ఒక పోస్టు చేశారు. మా దేశాన్ని,మా ఆటను మీరు తీసుకోలేరు'అని ట్రంప్‌కు చురకంటించారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు కెనడాపై అమెరికా టీమ్ విజయం సాధించాలని,కెనడా త్వరలో అమెరికా 51వ రాష్ట్రంగా అవతరించాలని ట్రంప్ ఒక పోస్టులో ఆకాంక్షించారు. దీనికి బదులుగా హాకీ మ్యాచ్‌లో కెనడా అమెరికాపై విజయం సాధించిన తర్వాత కెనడా ప్రధాని ట్రంప్‌కు కౌంటర్ ఇవ్వడం హాట్‌టాపిక్‌గా మారింది.అమెరికా,కెనడా మధ్య జరిగిన హాకీ మ్యాచ్‌లలో గత 50 ఏళ్లలో ఎక్కువ మ్యాచ్‌లు కెనడానే గెలుపొందడం గమనార్హం.కాగా4, రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా పదవి చేపట్టిన తర్వాత పొరుగు దేశమైన కెనడాపై 25 శాతం దిగుమతి సుంకాలు విధించిన విషయం తెలిసిందే.

# ఉపాధ్యాయ సంఘాలతో ఎమ్మెల్సీ అభ్యర్థి భేటీ.

విద్యా వ్యాప్తి కోసం ఎటువంటి అదనపు పనులు లేకుండా చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.అధికారంలోకి వచ్చిన వెంటనే కూటమి డీఎస్సీ ప్రకటించారని గుర్తు చేశారు. దీని ద్వారా ఎంతో మంది నిరుద్యోగులకు ఉపాధి కలుగుతోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఏ స్కూల్‌లో ఖాళీలు ఉన్నాయో.. వాటి ఆధారంగా ఉద్యోగాలను భర్తీ చేసే దిశగా అడుగులు వేస్తామని తెలిపారు. గడిచిన ఐదేళ్లలో జాబ్ క్యాలెండర్ విడుదల చేయ లేదని గుర్తు చేశారు. అప్పటి ప్రభుత్వంతో ఉపాధ్యాయులు సమస్యలపై పోరాడకుండా లాలూచీ పడ్డారని ఆరోపించారు.శాసనమండలిలో అమరావతి రాజధాని బిల్లు పెట్టినప్పుడు మీ గొంతు ఎందుకు లేవ లేదని ప్రశ్నించారు. వైసీపీ పాలనలో మద్యం దుఖాణాల ముందు ఉపాధ్యాయులను కాపలా ఉంచారని విమర్శించారు. ప్రభుత్వం వద్ద మీకు గౌరవం దక్కక పోతే మీ తరుపున తాను పోరాడతానని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ సభ్యులు ఉపాధ్యాయులు తనకు మద్దతు తెలుపుతోన్నందుకు ఈ సందర్భంగా వారికి ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి, సంక్షేమం కోసం పోరాడే వారిని గెలిపించాలంటూ ఉపాధ్యాయులకు సూచించారు.ఆంధ్రప్రదేశ్‌లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు.. ఫిబ్రవరి 28న జరగనున్నాయి. వీటి ఫలితాలు మార్చి 3వ తేదీన వెలువడనున్నాయి. ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతోన్న ప్రాంతాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ మద్దతు

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని గెలిపించాలని సంగారెడ్డి, సిద్దిపేట, మెదక్ జిల్లా కేంద్రాల్లో జరిగిన సమావేశాల్లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ఎంపీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన రఘునందన్‌రావును మెదక్‌లో బీఆర్ఎస్ నేతలు క్రాస్ ఓటింగ్ చేసి గెలిపించారని ఆరోపించారు.మాజీ సీఎం కేసీఆర్ బయటకు వస్తున్నానని అంటే ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిని నిలబెడతారని అనుకున్నానని.. కానీ ఆసుపత్రికి వెళ్లి స్కానింగ్ తీయించుకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా బడ్జెట్‌లో గుండు సున్నా మాత్రమే తెచ్చారని దుయ్యబట్టారు. మంత్రి దామోదర మాట్లాడుతూ మెదక్ జిల్లాను చార్మినార్ జోన్‌లో కలిపేలా సీఎం దృష్టికి తీసుకెళ్లానని అన్నారు. వర్గీకరణ, కులగణనకు వ్యతిరేకం కాదని ఆయన తేల్చి చెప్పారు.

# ఆ విషయాలు గుర్తుకు తెచ్చుకుని బండి సంజయ్ ఎమోషనల్

వరంగల్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రజల పక్షాన, ఉపాధ్యాయుల కోసం ఏనాడైనా ఉద్యమాలు చేశారా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. తాము ప్రజల కోసం ఉద్యమాలు చేశాం, లాఠీ దెబ్బలు తిన్నామని గుర్తుచేశారు. అయినా బీజేపీకి ప్రజలు ఓట్లు వేయలేదు... ఎన్నికల్లో గెలిపించలేదని చెప్పారు. పేద ప్రజల సమస్యల కోసం ఎందుకు పని చేయాలని బీజేపీ కార్యకర్తలు తమను ప్రశ్నిస్తున్నారని బండి సంజయ్ కుమార్ చెప్పారు.అందుకే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ సారి బీజేపీ బలపర్చిన వారికి ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీకి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేస్తే ఏమి వచ్చిందని నిలదీశారు. ఇవాళ(ఆదివారం) బండి సంజయ్ వరంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ... రేవంత్ ప్రభుత్వం రేషన్ కార్డు, ఇల్లు ఇచ్చిందా అని ప్రశ్నించారు. మరి ఎందుకు కాంగ్రెస్‌కు ఓటు వేస్తున్నారని అడిగారు. ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న వారికే ఓటు వేయాలని.. కొమ్ముకాస్తున్న వారికి ఓటు వేయద్దని అన్నారు. ఓటమి భయంతో సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రచారం కోసం వస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నేతలు మాయ మాటలు విని మోసపోవద్దని బండి సంజయ్ తెలిపారు.


# ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం

జరిగిన ప్రమాదానికి ప్రభుత్వం బాధ్యత వహించాలని కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇవాళ కొల్లాపూర్ పట్టణంలోని తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు పనులు జరిగినా ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదని గుర్తు చేశారు.హడావిడిగా పూర్తిస్థాయిలో నిధులు కేటాయించకుండా టార్గెట్‌తో ఒత్తిడి పెట్టి పని చేయించడంతోనే ప్రమాదం జరిగినట్లు ఆరోపించారు. ప్రభుత్వ నిర్లక్ష్య పూరిత వైఖరితో ఉద్యోగులు కార్మికులు ప్రాణాలు కోల్పోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టన్నెల్‌లో బోరింగ్ మిషన్ పాడైనట్లు తెలిసినా ఎందుకు పనులు చేయించినట్లు అని ఆయన ప్రశ్నించారు.లూస్‌గా ఉండే పైకప్పు ప్రాంతాన్ని రాడార్ లాంటి పరిజ్ఞానం వాడి గుర్తించకుండా సిపేజీ క్లియర్ చేయకుండా కార్మికుల ప్రాణాలను పణంగా పెట్టి పనులు చేయించారన్నారు. ప్రమాదంలో చనిపోయిన వారికి రూ.కోటి రూపాయలు పరిహారం ఇచ్చి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. గాయపడిన వారికి పూర్తిగా కోరుకునే వారికి వైద్య సాయం అందించి రూ.50 లక్షల సహాయాన్ని అందించాలన్నారు. ప్రమాదంపై స్వతంత్ర కమిటీతో విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# శివ పూజకు వేళాయె..!







ప్రాచీన శైవక్షేత్రం సత్రశాలలో మార్మోగనున్న శివనామ స్మరణ
భక్తుల క్షేత్ర దర్శన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

రెంటచింతల, మండల రిపోర్టర్- శ్రీనివాసరావు (శుభోదయం న్యూస్): భక్త జనావళి హరి హర మహాదేవ.. ఓం నమశ్శివాయ స్మరణలతో శివరాత్రిని భక్తి తన్మయత్వంతో జరుపుకునే సమయం ఆసన్నమైంది. ఆది దేవుడు, భక్త సులభుడు, భక్తవశంకరుడు అయిన పరమేశ్వరుడి పూజకు వేళయింది. హిందువుల పండుగలలో మహాశివరాత్రి ఎంతో ప్రాశస్త్యం గలది. శివ భక్తులకు పర్వదినమైన శివరాత్రి చాంద్రమానాన లెక్కింపు ప్రకారం కృష్ణపక్ష చతుర్థి రోజు వస్తుంది. ముక్కంటిగా భక్తకోటితో నిరంతరం పూజలందుకుంటున్న అభిషేక ప్రియుడి నామస్మరణతో మహాశివరాత్రి పండుగను జరుపుకోవడానికి భక్తులు సిద్ధమయ్యారు. ఉపవాస దీక్షలతో రాత్రంతా జాగరణ చేసి స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు సన్నద్ధమవుతున్నారు. శైవక్షేత్రాల్లో శివనామ స్మరణ చేసినా, దర్శించినా ముక్తి లభిస్తుందని భక్తులు భావిస్తారు. మహాశివరాత్రి పర్వదిన వేడుకలకు మండలంలోని ప్రాచీన శైవక్షేత్రం సత్రశాలలోని గంగా భ్రమరాంబిక సమేత పురాతన శివాలయం శివ పూజలకు ముస్తాబై ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతోంది. అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు గాను ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఆలయానికి రంగులు వేయడంతో ఆలయ గోపురాలు, ప్రాంగణం విద్యుద్దీప కాంతులతో ప్రకాశించేలా విద్యుద్దీపాలతో అలంకరణలు చేశారు. పండుగ శోభ సంతరించుకున్న ఆలయం భక్తుల శివనామ స్మరణతో మార్మోగనుంది. తెల్లవారుజాము నుంచే భక్తుల రద్దీ పెరగనున్న నేపథ్యంలో ఆలయ నిర్వహకులు పగడ్బందీ ఏర్పాటు చేశారు.వేడుకల్లో ప్రధానమైన అభిషేకాల్లో పాల్గొనేందుకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా క్యూలైన్లు, బారికేడ్లు, చలువ పందిళ్ళు ఇతరత్రా ఏర్పాట్లను పూర్తి చేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సౌకర్యం కల్పించారు. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేశారు. ట్రాఫిక్ నిబంధనలు అమలు చేసేందుకు పోలీసులు ప్రణాళిక రూపొందించారు.ఇప్పటికే ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో పలు పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. మహాశివరాత్రి ఉత్సవం సందర్భంగా ఆలయంలో శివపార్వతుల కల్యాణం, రుద్రాభిషేకాలు, లింగోద్భవ పూజలు నిర్వహిస్తారు. శివరాత్రి జాగరణ మానవ జీవితాలను కష్టాల నుంచి పరిహారం చేసి ముక్తిదాతగా వరాలు కురిపిస్తుందని నమ్మకం. ఉపవాస దీక్షలు ఆచరించే భక్తులు, ఆలయ సన్నిధిలో జాగరణకు తరలి వచ్చే భక్తుల కోసం నిర్వాహకులు అందుకు అనుగుణంగా శివలీలా కథాపారాయణాలు, కోలాట ప్రదర్శనలు, సాంస్కృతిక, ధార్మిక కార్యక్రమాల ఏర్పాట్లు చేశారు. కాగా ఆదివారం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి క్షేత్ర స్థాయి పర్యటన చేసి ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు,అధికారులతో కలిసి స్వామి దర్శనానికి క్షేత్రానికి వచ్చే భక్తుల వసతి,మౌలిక సదుపాయాల కల్పన ఏర్పాట్లను పరిశీలించారు. పవిత్ర కృష్ణానదీ తీరాన పుణ్యస్నానాలాచరించే స్నాన ఘట్టాలను పరిశీలించి స్నాన సమయంలో భక్తులు జాగ్రత్తలు పాటించేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. పరిశీలనలో ఎమ్మెల్యే వెంట అబ్బిరెడ్డి, రామకృష్ణ, వెంకట్రామిరెడ్డి, మల్లయ్య, సిద్దయ్య, ఇన్నారెడ్డి, గొట్టం శ్రీనివాసరెడ్డి తదితర టీడీపీ నేతలు పాల్గొన్నారు.

## గ్రూప్ 2 పరీక్షలకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ఏర్పాట్లు




ఏలూరు, శుభోదయం న్యూస్ : ఏలూరు సి ఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాన్ని స్వయంగా పరిశీలన చేసిన ఏలూరు జిల్లా ఎస్పీ శ్రీ కె ప్రతాప్ శివ కిషోర్ ఐపిఎస్ వారు ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పరీక్షా కేంద్రాల వద్ద ఉద్యోగ నిర్వహణ చేస్తున్నటువంటి అధికారులకు దశ దిశ కార్యక్రమాలను గురించి ఆదేశాలను ఇచ్చి నిష్పక్షపాతముగా ఉద్యోగ నిర్వహణ చేయాలని, పరీక్షా కేంద్రాల



వద్దకు హాజరయ్యే 4,415 మంది అభ్యర్థులకు తగిన సహాయ సహకారాలను అందించాలని అధికారులకు తగిన సూచనలు సలహాలు మరియు ఆదేశాలు ఇచ్చిన జిల్లా ఎస్పీ..ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ వారి యొక్క నియమ నిబంధనలకు అనుగుణంగా ఉద్యోగాలు పరీక్షలకు హాజరయ్యే వారికి ట్రాఫిక్ ఎటువంటి అంతరాయం కలగకుండా మరియు పరీక్షా కేంద్రాల యొక్క సమాచారాన్ని ఉద్యోగార్థులకు తెలియజేస్తూ, పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవకతవకలకు అవకాశాలు లేకుండా నిష్పక్షపాతంగా ఉద్యోగ నిర్వహణ చేస్తున్న ఏలూరు పోలీస్ యంత్రాంగం.జిల్లా ఎస్పీతో పాటుగా ఏలూరు డిఎస్పి శ్రీ డి శ్రావణ్ కుమార్ ఎస్ బి ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు ఏలూరు ఇన్స్పెక్టర్ కోటేశ్వరరావు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పొలం ఉన్న ప్రతి రైతు భూ ఆధార్ చేయించుకోవాలి : ఏవో శేష రెడ్డి



ఎర్రగొండపాలెం, మండల రిపోర్టర్ - నారాయణ (శుభోదయం న్యూస్): యర్రగొండపాలెం మండలంలో ప్రతీ రైతు ఫిబ్రవరి నెల చివరి లోపు భూ ఆధార్ చేయించుకోవాలని రైతులను వ్యవసాయాధికారి శేషరెడ్డి కోరారు. యర్రగొండపాలెం పట్టణం లోని సచివాలయం 1లో రైతు సేవా కేంద్రం వద్ద కు వచ్చిన శేషరెడ్డి కేంద్రం వద్ద రైతులతో మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ పథకాలకు సరైన లబ్ధిదారులను గుర్తించి పథకాలు వర్తింప చేసేందుకు భూ ఆధార్ అనే కార్యక్రమం తీసుకు వచ్చిన్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో వ్యవసాయశాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమమని తెలిపారు. ఈపథకం ద్వారా పీఎం కిసాన్ చెల్లింపు పెట్టుబడి సాయం, పంటల బీమా, అన్నదాన సుఖీభవ, యాంత్రీకరణ పరికరాలు, పంటరుణాలు, వడ్డీ రాయితీ మొదలగు ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ప్రతీ రైతు తన ఆధార్కార్డు, ఆధార్కు అనుసంధానమైన ఫోన్ నంబరు, పట్టాదారు పాసు పుస్తకం నకలు తీసుకుని రైతు సేవా కేంద్రాలలో అగ్రికల్చరల్ అసిస్టెంటు ను సంప్రదించాలన్నారు. ఈ కార్యాక్రమంలో వ్యవసాయ అధికారితో పాటు ఏఇఓ మాల్యాద్రిరెడ్డి అగ్రికల్చరల్ అసిస్టెంట్ మంత్రు నాయక్ రైతులు, పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా, పెద్ద దోర్నాల మండలం, తూర్పుబొమ్మలాపురంలో 23-2 2025 న, అన్నపురెడ్డి నారాయణరెడ్డి, చిట్యాల రాజ్యలక్ష్మి గార్ల పెళ్లి వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపిన వైసిపి ఆంధ్ర రాష్ట్ర అధికార ప్రతినిధి ఎర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్ గారు, మరియు ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ దోర్నాల మండలం కన్వీనర్ గంట వెంకటరమణారెడ్డి మరియు దోర్నాల మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.

## మార్కాపురంలో ఘనంగా సంత్ గాడ్గే బాబా జయంతి....

స్వచ్ఛ భారత్ పితామహుడిగా ప్రకటించాలి : దేవలూటి శంకర్






మార్కాపురం, శుభోదయం న్యూస్ : ఈ రోజు మార్కాపురంలో స్థానిక జవహర్ నగర్ కాలనీలో "రజక విద్యా సేవా సంక్షేమ సంఘం అధ్యక్షులు దేవలూటి శంకర్ గారి ఆధ్వర్యంలో సంత్ గాడ్గే బాబా గారి జయంతి ఘనంగా నిర్వహించారు" ముఖ్య అతిథులుగా రాష్ట్ర నాయకులు పి.వెంకటేశ్వర్లు , రిటైర్డ్ ఉపాధ్యాయులు పేరూరి వెంకటేశ్వర్లు, రాచకొండ కాశయ్య, ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి శివయ్య , ఏపీ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్స్ ,జేఏసీ చైర్మన్ : మాదాసు రంగనాయకులు : వైస్ చైర్మన్: నల్లబోతుల శ్రీనివాసరావు, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ : గాలం కాశయ్య గారు హాజరయ్యారు.23-2-2025 ఆదివారం సంత్ గాడ్గే బాబా 149వ జయంతి సందర్భంగా సంత్ గాడ్గే బాబా మహారాజ్ గారి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించిన నాయకులు, మరియు వివిధ కుల సంఘాల నాయకులు శంకర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించిన వారు సంఘ సంస్కర్తగా, గ్రామాల్లో శుభ్రత, తోటి వారికి సాయపడే లక్షణం, కుల నిర్మూలన, అంటరానితనం నిర్మూలన, ఆధ్యాత్మిక చైతన్యం, సేవా వంటి వాటిని ప్రచారం చేస్తూ 154 పాఠశాలలు మరియు మహారాష్ట్ర లో యూనివర్సిటీ కూడా స్థాపించడం జరిగింది. గాంధీజీ కంటే 15 సంవత్సరాల ముందే "స్వచ్ఛభారత్"ను కనిపెట్టి ఆచరించిన మహనీయుడు అని కొనియాడారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కావున స్వచ్ఛ భారత్ పితామహుడిగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.పేరూరి వెంకటేశ్వర్లు సార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తన "గురువు"గా బాబాని ప్రకటించుకోవడం జరిగింది. అలాంటి గొప్ప వ్యక్తిత్వం కలిగిన సంత్ గాడ్గే బాబా సేవలు ప్రభుత్వం గుర్తించి జయంతిని అధికారికంగా నిర్వహించాలని మరియు ఫిబ్రవరి 23ను "సఫాయి కర్మచారి దివాస్గా" ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.. 80 మంది పేద విద్యార్థులకు, తల్లిదండ్రులు లేని విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయడం జరిగింది. కార్యక్రమంలో రజక విద్యా సేవా సంక్షేమ సంఘం అధ్యక్షులు : దేవలూటి శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు శివయ్య ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి : రాచకొండ కాశయ్య, రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ ముత్తుకూరు చిరంజీవి ,జిల్లా వర్కింగ్ సెక్రటరీ లక్ష్మీనారాయణ , నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి : అరెపాటి కాశయ్య, జిల్లా నాయకులు కాశి రావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశైలం వెళ్లే భక్తులకు పెద్ద బొమ్మలాపురం వాస్తవ్యులు భోజనం ఏర్పాట్లు



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య (శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మండలం పెద్ద బొమ్మలాపురం గ్రామ ప్రజలు మహాశివరాత్రి సందర్భంగా 23,24,25 మూడు రోజులు భోజనం ఏర్పాట్లు చేశారు. గ్రామ ప్రజలందరూ ఎంతో ప్రేమతోటి వారి స్వంత ఖర్చుతో, అదేవిధంగా గ్రామ ప్రజలే వంట చేసి శ్రీశైలం వెళ్లే శివ భక్తులకు ఎంతో ప్రేమతోటి వడ్డిస్తున్నారు. అక్కడ భోజనం ఓండే కార్యక్రమం దగ్గరుండి చూసుకుంటున్నారు. వాటర్ మరియు వడ్డించుట అన్ని పనులు పెద్ద బొమ్మలాపురం గ్రామ ప్రజలు దగ్గరుండి చూసుకుంటున్నారు. ఈరోజు ఈ కార్యక్రమంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ తాటిపర్తి చంద్రశేఖర్ మరియు దోర్నాల మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ గంట వెంకటరమణారెడ్డి. మరియు దోర్నాల మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొని ఎంతో ప్రేమతోటి శివ భక్తులకు భోజనం వడ్డించారు.



## టంగుటూరులో ఘనంగా నిర్వహించిన న్యూ లైఫ్ విద్యార్థుల ప్రార్థన సమావేశం!




టంగుటూరు మండల రిపోర్టర్ :- వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- టంగుటూరు పాకల రోడ్డులోని న్యూ లైఫ్ పరిశుద్ధ ఆరాధన మందిరం ప్రాంగణంలో ఆదివారం న్యూ లైఫ్ విద్యార్థుల ప్రార్థన సమావేశం జరిగింది. న్యూ లైఫ్ హెూలీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి పేస్ కాలేజ్ లెక్చలర్ కావ్య అధ్యక్షత వహించడం జరిగింది. ముఖ్య అతిథులుగా ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ సంహిత విద్యార్థులను ఉద్దేశించి వారిని ప్రోత్సహిస్తూ తన సందేశాన్ని ఇవ్వడం జరిగింది. తదనంతరం న్యూ లైఫ్ మినిస్ట్రీస్ అధినేత రెవరెండ్ డాక్టర్ సుదర్శన్ బాబు మాట్లాడుతూ సామాన్యులైన దృఢ సంకల్పంతో కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. ఈ




క్రమంలో ప్రతి ఒక్కరు ఈ దేశానికి గర్వకారణంగా చదువులో ముందుకు రాణించాలని కోరుతున్నామన్నారు. తదనంతరం విద్యార్థులకు పెన్నుల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో దైవజనులు ఎస్తేరు రాణి, అమృత సుదర్శన్, శామ్యూల్, రెసిడెన్షియల్ స్కూల్ ఉపాధ్యాయులు శైలజ తదితరులు వివిధ ప్రాంతాలకు చెందిన 600 మంది పైచీలకు విద్యార్థినీ విద్యార్థులు ఈ ప్రార్థనా సమావేశ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.



## బండారుగూడెం గ్రామంలో
## ఘనంగా ఉప్పులేటి ప్రసాదరావు శత జయంతి వేడుకలు




నూజివీడు ప్రతినిధి ఫిబ్రవరి 23 (శుభోదయం న్యూస్):తన జీవితాన్ని త్యాగం చేసిన కార్మిక నాయకుడు, ఉపాధ్యాయనేత స్వర్గీయ ఉప్పులేటి ప్రసాదరావు అని పలువురు వక్తలు కొనియాడారు. బాపులపాడు మండలం బండారుగూడెంలో ఆదివారం ఉప్పులేటి ప్రసాదరావు శత జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ దేశ విముక్తి కోసం , దోపిడీదారులు నుండి శ్రామిక వర్గం రక్షణ కోసం జైలు జీవితం గడిపిన ఆదర్శనీయుడు ఉప్పులేటి ప్రసాదరావు అని కొనియాడారు. కుటుంబానికి దూరంగా ఉండాల్సి వచ్చినప్పటికీ కుమారులను ఉన్నత అధికారులుగా తీర్చిదిద్దారని అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య తో పాటు జైలు జీవితం గడిపి తన జీవితాన్ని సార్థకత చేసుకున్నారని అన్నారు. ముందుగా ఉప్పులేటి ప్రసాదరావు విగ్రహానికి కుమారులు, కుటుంబ సభ్యులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు, ముందుగా కుమారులు ఉప్పులేటి నేతాజీ, డాక్టర్ దేవీప్రసాద్ ,డాక్టర్ తారక ప్రసాద్, సత్యప్రసాద్, సుందర్ ప్రసాద్ కుమార్తెలు ఝాన్సీ, ఉదయకుమారి, గ్రామస్తులు వడ్లమూడి తిరుపతి రావు, కొరివి వినయకుమార్, మెల్లం బాఘ్యారావు, పోలిమెట్ల జయరాజు తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు పెద్ద ఎత్తున 1,000 మందికి పైగా అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. కుటుంబ సభ్యులు పేదలకు స్టీల్ పాత్రలతో పాటుఫ్రూట్స్, స్వీట్స్ పంపిణీ చేశారు.

## మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పుట్టపర్తి నియోజకవర్గం లో సుడిగాలి పర్యటన
## పలు వివాహాలు, నూతన గృహ ప్రవేశం,శ్రీమంతం కార్యక్రమాలకు హాజరైన మాజీ మంత్రి పల్లె



శ్రీ సత్యసాయి జిల్లా బ్యూరో వై. పోతులయ్య (శుభోదయం న్యూస్ )మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పుట్టపర్తి నియోజకవర్గం లో ఆదివారం సుడిగాలి పర్యటన చేశారు. కొత్తచెరువు మండలంలోని బైరాపురం క్రాస్ సాయినగర్ లో జరిగిన టీడీపీ కుటుంబ సభ్యుల కు చెందిన వివాహా కార్యక్రమానికి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ కార్యక్రమానికి విచ్చేసిన పుట్టపర్తి నియోజకవర్గ ప్రజలను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమలు అడిగి తెలుసుకున్నారు. కొత్తచెరువు మండల కేంద్రంలోని సత్యసాయిబాబా భజన మందిరంలో ఎర్రబల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కేశప్ప సోదరుడి కుమారుడి వివాహానికి మాజీ మంత్రి పల్లె హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.పుట్టపర్తి కర్ణాటక నాగేపల్లి గ్రామంలో నూతన గృహప్రవేశానికి హాజరయ్యారు. కర్ణాటక నాగేపల్లి చాకల సూర్యనారాయణ ,శ్రీలక్ష్మి దంపతుల నూతన గృహప్రవేశానికి హాజరై శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించారు.ఓడి చెరువు మండలం లో మండల



టీడీపీ కన్వీనర్ జయచంద్ర కోడలు స్వప్న శ్రీమంతం కార్యక్రమానికి మాజీ మంత్రి పల్లె హాజరై ఆశీర్వదించారు.ఓడి చెరువు మండలం గొల్లవారి పల్లికి చెందిన మండల టిడిపి నాయకులు శెట్టి వారి జయచంద్ర , శెట్టి వారి భారతి కోడలు స్వప్న శ్రీమంతం కార్యక్రమానికి హాజరై ఆశీర్వదించారు. శ్రీమంతం కార్యక్రమంలో నిండు గర్భిణీ అయినా స్వప్నను అక్షింతలతో ఆశీర్వదించి చీరను బహుకరించారు.

## కుంభమేళా జలాలను పెనుకొండ
## భోగసముద్రం చెరువులో కలిపిన మంత్రి సవిత
### భక్తిశ్రద్ధలతో పుణ్య స్నానాలుచేసి పరవశించిన భక్తులు-





శ్రీసత్యసాయి జిల్లా బ్యూరో వై. పోతులయ్య (శుభోదయం న్యూస్) మహా కుంభమేళా నుంచి తీసుకొచ్చిన జలాలను రాష్ట్ర బిసి సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి సవిత ఆదివారం పెనుకొండ భోగసముద్రం చెరువులో కలిపారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ పట్టణంలో మహిళలు, పట్టణ ప్రముఖులు పెద్ద ఎత్తున పాల్గొని పవిత్ర జలాల ను కళశాలతో చెరువు వరకు ఊరేగింపుగా తీసుకువెళ్లి, వేద పండితుల మంత్రోచ్ఛరణలతో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత జలాల చెరువులో కలిపారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ మహా కుంభమేళాకు వెళ్లలేని భక్తుల సౌకర్యార్థం ఈ కార్యక్రమాన్ని పెనుకొండలో చేపట్టడం హర్షనీయమని అన్నారు ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొల్లకుంట అంజనప్ప, బి జె వి పి ఎస్ కమిటీ సభ్యులు పలువురు కూటమి నాయకులు భక్తాదులు పెద్ద ఎత్తున తరలివచ్చి పుణ్య స్నానాలు ఆచరి%శీ%చారు, కూటమి నాయకులు టిడిపి పట్టణ అధ్యక్షుడు శ్రీరాములు, బిజెపి, జనసేన, నాయకులు, విశ్వ హిందూ పరిషత్ ,తదితరులు పాల్గొన్నారు..

## నూతన వధూవరులను ఆశీర్వదించిన
## ఎంపీలు బీకే పార్థసారథి, అంబిక లక్ష్మీనారాయణ



శ్రీసత్యసాయి జిల్లా బ్యూరో వై. పోతులయ్య (శుభోదయం న్యూస్ ):నెల్లూరు పట్టణంలోని. ఈ పి ఆర్ కన్వెన్షన్ హాల్ నందు మాజీ ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్ కుమారుని వివాహానికి ఆదివారం హాజరై




నూతన వధూవరులను హిందూపురం పార్లమెంట్ సభ్యులు బికె పార్థసారథి, అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ,అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్ , మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ పూలనాగరాజు తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## శ్రీశైలం వెళ్లే శివ భక్తులకు భోజనం ఏర్పాట్లు



దోర్నాల మండల రిపోర్టర్- ఆవులయ్య ( శుభోదయం న్యూస్): ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం, పెద్ద బొమ్మలాపురం గ్రామ ప్రజలు శ్రీశైలం వెళ్లే శివ భక్తులకు 23-2-2025 న భోజనం ఏర్పాట్లు ఈరోజు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్ద బొమ్మలాపురం గ్రామ ప్రజలు, అలాగేతెలుగుదేశం పార్టీ రాష్ట్ర టి ఎన్ టి యు సి ప్రధాన కార్యదర్శి బట్టు సుధాకర్ రెడ్డి, మరియు దోర్నాల మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొని ఎంతో ప్రేమతోటి శ్రీశైలం వెళ్లే శివ భక్తులకు భోజనం వడ్డించారు.

## ఎమ్మెల్సీ తూమాటి, అధికార పార్టీ నాయకుల మధ్య వాగ్వాదం



లింగసముద్రం మండలం సురేష్ (శుభోదయం న్యూస్ ):లింగసముద్రం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న సర్వసభ్య సమావేశంలో శాసనమండలి సభ్యులు తూమాటి మాధవరావుకు మరియు ఎంపీపీ పెన్నా కృష్ణయ్య పలువురు తెలుగుదేశం పార్టీ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. టిడిపి నాయకులు గత ప్రభుత్వం అభివృద్ధి పట్టించుకోలేదని రాళ్లపాడు ప్రాజెక్టును గాలికి వదిలేసారని ఎమ్మెల్సీ మరియు ఎంపీపి ని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేశాడని తెలియజేశారు.

## గ్రంథాలయంలో జరిగిన చదవడం నాకిష్టం కార్యక్రమం!



టంగుటూరు మండల రిపోర్టర్ : వెంకటేశ్వర్లు టి (శుభోదయం న్యూస్) :- రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న చదవడం నాకిష్టం కార్యక్రమం ఆదివారం టంగుటూరు గ్రంథాలయంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ నిర్వాహకులు గుమ్మడి వర్ధన్ రాజు మాట్లాడుతూ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తమ పిల్లలను గ్రంథాలయానికి పంపించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

## ఆదివారం పిల్లలతో మరియు గురుకుల పాఠశాలకు ప్రోత్సహం



సింగరాయకొండ, మండల రిపోర్టర్ - పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్):- శానంపూడి గ్రామానికి చెందిన మోటుపల్లి హరీష్ కుమారుని పుట్టినరోజు సందర్భంగా వీరి కుటుంబ సభ్యులు ఈరోజు గిరిజన కాలనీ చిన్నారులతో సరదాగా గడిపి వారికి భోజనం ఏర్పాటు చేశారు.కార్యక్రమ నిర్వహకులు హైకోర్టు న్యాయ వాది పంతగాని వెంకటేశ్వర్లు ఈసందర్భంగా మాట్లాడుచు ప్రతి ఆదివారము పాఠశాలకు సెలవు రోజు కాబట్టి చిన్నారులను కలిసి,వారిలో సృజనాత్మకతను పెంపొందించే ఆటపాటలతో సరదాగా గడుపుతామన్నారు. అదేవిధంగా ప్రస్తుతం కాలంలో విద్యార్థి దశలో గురుకుల,నవోదయ పాఠశాలలలో ఐదవ తరగతి ప్రవేశం కొరకు మొదటి సారిగా ప్రవేశ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులను కలిసి, వారిచే గురుకుల పాఠశాల ప్రవేశం కొరకు అప్లికేషన్ తామే స్వయంగా పూర్తి చేసి ప్రోత్సహిస్తున్నామన్నారు.చిన్నారుల తల్లిదండ్రులతో మమేకమై చేస్తున్న తమ ప్రయత్నంలో కనీసం కొంతమంది విద్యార్థులు అయినా గురుకుల పాఠశాలలో ప్రవేశం పొంది వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటారని ఆశపడుచున్నామన్నారు.కార్యక్రమంలో మోటుపల్లి కార్తీక్, సాంబయ్య మరియు వారి మిత్రబృందం పాల్గొన్నారు.

## పారిశుధ్య, వాతావరణ కాలుష్య నివారణ అందరి భాధ్యత
## డీ ఎల్ పి వో పద్మ పిలుపు



సింగరాయకొండ, మండల రిపోర్టర్ పసుమర్తి జాలయ్య (శుభోదయం న్యూస్ ):-నివాస ప్రాంతాలలో పారిశుధ్య, పర్యావరణ కాలుష్య నివారణ నియంత్రణ అందరి భాధ్యత అని ఒంగోలు డివిజనల్ పంచాయితీ అధికారి పద్మ పిలుపు ఇచ్చారు. ఆదివారం సింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలో చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ స్వచ్ఛ భారత్ కార్యక్రమం లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటి ప్రచారం లో భాగంగా పారిశుధ్యం, పర్యావరణం పరిరక్షణ లో ప్రజల భాగస్వామ్యం, స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా గ్రామీణ అభివృద్ధి లో స్వచ్ఛ గ్రామ పంచాయితీలు గా తీర్చి దిద్దుకోవడం అందరి భాధ్యత అన్నారు. గ్రామ పంచాయితీ పారిశుధ్య సిబ్బందికి ప్రజల సహకరించాలని తమ తమ ఇండ్ల లో విడివిడిగా తడి చెత్త పొడి చెత్తని ఉంచి ఇంటి వద్దకు వచ్చే పారిశుధ్య వాహనం వద్ద కి చేర్చుడాన్ని అలవరచు కోవాలన్నారు.నివాస ప్రాంతాల వద్ద చెత్త పేరుకు పోయినా,రోడ్లు, రోడ్డు పరిసరాలు, మురుగు కాల్వల చెత్త పేరుకు పోతే ఆ ప్రాంతాలు అనారోగ్య వాతావరణానికి దారితీస్తాయి అని ఆమె ప్రజలకు హితవు చెప్పారు. ప్రభుత్వం ప్రతి నెల మూడవ ఆదివారం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని చేపట్టిందని కనీసం ఈ సందర్భంగా ఆయన పారిశుధ్య పరిరక్షణ కి చర్యలు తీసుకునే అవకాశం లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయితీ సిబ్బంది, పారిశుధ్య కార్మికుల గ్రామ పంచాయితీ కార్యాలయం వద్ద నుండి గ్రామ పంచాయితీ పరిధిలో అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ లో గ్రామ పంచాయితీ కార్యదర్శి సతీష్, బిల్ కలెక్టర్ చెరుకూరి శ్రీనివాస రావు,సిబ్బంది పాల్గొన్నారు

## ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో
## బొబ్బిలి నియోజకవర్గం టీడీపీ నాయకులు..!!!



విజయనగరం,జిల్లా ప్రతినిధి, బొద్దాన.శ్రీనివాస్.(శుభోదయం న్యూస్):ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) ఆదేశాల మేరకు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో బొబ్బిలి నియోజకవర్గ టీడీపీ నాయకులు.. కూటమి ప్రభుత్వం బలపరిచిన అభ్యర్థి పాకలపాటి



రఘువర్మ గారికి మొదటి ప్రాధాన్యత ఓటును వేసి తమ మద్దతు తెలపాలని బొబ్బిలి పట్టణం, బొబ్బిలి మండలం, తెర్లాం మండలంలో ఉన్న ఉపాధ్యాయులను అభ్యర్థించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..!!!

## విజయనగరం పీవీఆర్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న టీడీపీ
## మాజీ ఎంపీటీసీని పరామర్శించిన ఎమ్మెల్యే బేబీ నాయన..!!!




విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొద్దాన.శ్రీనివాస్(శుభోదయం న్యూస్):బొబ్బిలి నియోజకవర్గం రామభద్రపురం మండలం పాతరేగకు చెందిన మాజీ ఎంపీటీసీ మరియు నీటి సంఘం అధ్యక్షుడు పెద్దింటి పైడిపి నాయుడు, అనారోగ్యం కారణంగా విజయనగరంలో పీవీఆర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు, ఆ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన)ఈరోజు ఉదయం ఆసుపత్రికి వెళ్లి పైడిపినాయుడు గారిని పరామర్శించి, వైద్యులతో వారి ఆరోగ్య పరిస్థితిని గురించి మాట్లాడి, ప్రత్యేక శ్రద్ధ తీసుకోవలసినదిగా సూచించారు..!!

## బొబ్బిలి నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో
## పాల్గొన్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు..!!!



విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొద్దాన.శ్రీనివాస్.(శుభోదయం న్యూస్):ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే శ్రీ బేబీనాయన గారితో కలిసి ఎంపీ శ్రీ కలిశెట్టి అప్పలనాయుడు మీడియా సమావేశం.కూటమి బలపరిచిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ పాకలపాటి రఘువర్మ గారికి మద్దతుగా ఈరోజు గౌరవ ఎంపీ శ్రీ కలిశెట్టి అప్పలనాయుడు గారు విజయనగరం పార్లమెంట్ సెగ్మెంటులో పలు నియోజకవర్గాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.. అందులో భాగంగా, ఈరోజు సాయంత్రం బొబ్బిలి నియోజకవర్గంలో పర్యటించి ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) గారితో కలిసి బొబ్బిలి కోటలో మీడియా సమావేశంలో పాల్గొని, బొబ్బిలి నియోజకవర్గ ఉపాధ్యాయులంతా పాకలపాటి రఘువర్మ గారికి తమ ఓటును వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో బొబ్బిలి నియోజకవర్గ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.!

## కర్ణాటక కోలార్ జిల్లాలో పవన్ కళ్యాణ్ కొత్త ఆఫీస్ పూజ

### రాష్ట్ర అధ్యక్షుడు మురళి గౌడ



కోలార్: (శుభోదయం న్యూస్) : అఖిల కర్ణాటక పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు సేవా సంఘ ఆధ్వర్యంలో కర్ణాటక కోలార్ జిల్లాలో జరిగిన కొత్త ఆఫీస్ పూజ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడైన మురళి గౌడ గత ఆరు సంవత్సరాల నుంచి పవన్ కళ్యాణ్ పేరుతో కర్ణాటక ఆంధ్రప్రదేశ్ ఉన్న జనసేన కార్యకర్తలకి ఏమి కష్టమొచ్చినా కూడా కర్ణాటక తరపున తన వంతు అనేక సహాయాలు తీసుకొస్తున్నారు రానున్న రోజుల్లో కూడా అలాగే పవన్ కళ్యాణ్ అభిమానులకు సహాయ సహకారాలు అందిస్తాము అన్నారు. అయితే కర్ణాటకలో ఉన్న పవన్ కళ్యాణ్ అభిమానులకు ఒక ఆశ ఉంది వచ్చే రోజుల్లో జనసేన పార్టీ అనేది కర్ణాటకలో కూడా రావాలని అలాంటి వ్యక్తి భారతదేశానికి కావాలని కర్ణాటకలో ఉన్న అభిమానుల కోరిక కర్ణాటక కి జనసేన పార్టీ వస్తుందంటే ఎంత కష్టమైనా పడడానికి కర్ణాటకలో ఉన్న అఖిల కర్ణాటక పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులు సేవా సంఘం ఉన్న నాయకులు కార్యకర్తలు అభిమానులు ఎల్లప్పటికీ సిద్ధంగా ఉంటామని తెలియజేస్తున్నాను. కర్ణాటకలో ఉన్న అన్ని నియోజకవర్గాలకు బట్టల బ్యాగులని అందించడం జరిగినది. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన అనేకమంది అభిమానులకు చక్కటి భోజనం ఏర్పాటు చేయించారు .ఈ కార్యక్రమం నిర్వహించినవారు కోలార్ జిల్లా అధ్యక్షుడు ఎంపీ ఎస్ మంజునాథ్, ములభాగులు తాలూకా అధ్యక్షులు సుబ్రమణి ఉపాధ్యక్షులు మంజునాథ్ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో హాజరైన వాళ్ళు :- రాష్ట్ర గోరువా అధ్యక్షులు మంజునాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్ కుమార్, రాష్ట్ర సలహా అధ్యక్షుడు సంతోష్, బెంగళూరు నగర అధ్యక్షుడు మంజునాథ్, కన్నడ ఫిలిం నిర్దేశకులు రాజు,కులం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదర్శ్ ,కోలార్ జిల్లా ఉపాధ్యక్షుడు మధు, శ్రీనివాసపురం తాలూకా అధ్యక్షులు రమే గౌడ, బంగారు పెట్టే తాలూకా అధ్యక్షులు శశి కిరణ్, పదాధికారులు యారబ్,కిరణ్, మూర్తి, గంగాధర్, మునీంద్ర, మంజు, చాలామంది కార్యకర్తలు అభిమానులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఇండియన్ మెడికల్ అసోసియేషన్, బొబ్బిలి వారి ఆధ్వర్యంలో జరిగిన సీఎంఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీ నాయన..!!!



విజయనగరం, జిల్లా ప్రతినిధి, బొద్దాన. శ్రీనివాస్ (శుభోదయం న్యూస్):బొబ్బిలి పట్టణంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, బొబ్బిలి వారి ఆధ్వర్యంలో నిన్న ఈరోజు జరిగిన సీఎంఈ కార్యక్రమంలో(ఐఎంఏ)బొబ్బిలి వారి ఆహ్వానం మేరకు నిన్న ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్.కే.కే.రంగారావు (బేబీ నాయన) పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలు ప్రాంతాలకు చెందిన సీనియర్ వైద్యులు, స్థానిక (ఐఎంఏ)సభ్యులు పాల్గొన్నారు.ఎమ్మెల్యే బేబీనాయన మాట్లాడుతూ, బొబ్బిలి పట్టణంలో ఇంత మెగా ఈవెంట్ నిర్వహించిన (ఐఎంఏ) బొబ్బిలి వారిని అభినందనలు తెలిపారు, అలానే ఇటువంటి కార్యక్రమాలు ద్వారా వైద్యరంగంలో వస్తున్న అత్యాధునిక సదుపాయాలను గురించి తెలుసుకుని ప్రజలకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు దోహదపడుతుందని తెలిపారు..(ఐఎంఏ) బొబ్బిలి వారికి ప్రభుత్వం తరపున కానీ, తన నుంచి కానీ ఎటువంటి సహాయం కావాలన్నా తాను ఎప్పుడు అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు..!!




## పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపు కోసం కృషి చేయలి



రామగుండం మండలం రిపోర్టర్- తిరుపతి, (శుభోదయం న్యూస్) తెలంగాణ రాష్ట్ర పీసీసీ ఆదేశాలమేరకు రామగుండం శాసన సభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ నగర పాలక అధ్యక్షులు బొంతల రాజేష్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఉప అధ్యక్షుడు ఎస్ వై థామస్ ఎమ్మెల్సీ ఎన్నికల పెద్దపల్లి, మంచిర్యాల్ జిల్లాల ఇంచార్జ్ )మరియు రామగుండం ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ భూక్య వెంకటేష్ , పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు బొంకూరి అవినాష్, ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన యువజన కాంగ్రెస్ నాయకుల సమావేశంలో నాయకులు మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి ఆల్ఫోర్స్ నరేందర్ రెడ్డి గెలుపు కోసం క్షేత్ర స్థాయిలో ఇంటి ఇంటికి వెళ్లి పట్టభద్రులను కలిసి కాంగ్రెస్ పార్టీ విద్యార్థులకు,పట్టభద్రులకు, నిరుద్యోగుల కోసం చేసిన కృషి గురించి క్లుప్తంగా వివరించి పట్టభద్రుల అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటు ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్ రెడ్డి కి వేసి భారీ మెజారిటీ తో గెల్పించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దెల్లి తేజస్విని, కార్పొరేషన్ అధ్యక్షుడు కౌటం సతీష్ , నగర అధ్యక్షుడు కె శివ , పెరుక జ్యోతి , గౌస్ ఖాన్ ,అజయ్ సింగ్ , గంగమల్లేష్, అనిల్, మరియు యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



## : మాజీ జడ్పీ చైర్మన్ ములుగు బి ఆర్ ఎస్ పార్టీ ఇన్చార్జి బడే నాగజ్యోతి ఆదేశాల మేరకు పరామర్శ



మంగపేట, మండల రిపోర్టర్ - తులసి (శుభోదయం న్యూస్):మృతురాలి కుటుంబానికి పరామర్శించి 50 కేజీల బియ్యం 2500 రు అందించిన తాడ్వాయి బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఆదివారం రోజున తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన ఇర్పా సారంగపాణి తల్లి గారైన ఇర్పా సమ్మక్క అనారోగ్యంతో మృతి చెందగా వారి కుటుంబాన్ని పరామర్శించి వారి దశదిన కర్మకు ఆర్థిక సాయంగా 50 కేజీల బియ్యం 2500 రు. అందించిన బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రామ సహాయం శ్రీనివాస్ రెడ్డి తాడ్వాయి మాజీ ఉపసర్పంచ్ ఆలేటి ఇంద్రారెడ్డి తాడ్వాయి మండలం ఉపాధ్యక్షుడు చల్లా రజనీకర్ రెడ్డి గ్రామ కమిటీ అధ్యక్షుడు తుమ్మల రాజేందర్ ముదిరాజ్,యూత్ సభ్యులు చీమల శ్రావణ్ ఆళ్ల నితిన్ పోల్దాసరి రంజిత్ దుర్గం నవీన్ కామారం సోలం రామ్ పాయం ప్రేమ్ చేరుప విజయ్ గుగ్రాల రవి గంట మనోజ్ రెడ్డి గంట సురోజిరెడ్డి మనుగొండ నవీన్ కుక్కల చందు గట్టు వంశీ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మదన్మోహన కు మా పూర్తి మద్దతు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి (శుభోదయం న్యూస్):- నాగిరెడ్డిపేట్ మండలం అచ్చాయ పల్లి లో ఉట్కూరి నరేందర్ రెడ్డి గెలుపుకోసం అందరం మద్దతు తెలుపుతున్నట్లు,ఆదివారం రోజు నాగిరెడ్డి పెట్ మండలం అచ్చయా పల్లి లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఉట్కూరి నరేందర్ రెడ్డి గెలుపుకోసం మాజీ సర్పంచ్, కొంపల్లి శైలజ ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అచ్చయ పల్లి గ్రామంలో పట్టభద్రుల ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉట్కూరి నరేందర్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని వారు ఓటర్లను కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి కట్టుబడి ఉందని, నరేందర్ రెడ్డి విజయం సాధిస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తారని తెలిపారు.

## సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆదం సంతోష్ కుమార్, బౌద్ధ నగర్ డివిజన్లో బస్తీ పర్యటన...

### పాల్గొన్న ఎన్ ఎస్ యు ఐ మాజీ ఉపాధ్యక్షులు ఆదం సృజన్ కుమార్.. గత పది సంవత్సరాలుగా పేరుకుపోయిన సమస్యలు,



తెలంగాణ స్టేట్ బ్యూరో, దొమ్మాటి శివకుమార్,( శుభోదయం న్యూస్): సికింద్రాబాద్ నియోజకవర్గం బౌద్ధ నగర్ డివిజన్ లో సికింద్రాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆదం సంతోష్ కుమార్ బస్తీ ప్రజలకు ఫిర్యాదు మేరకు, ఇంజనీరింగ్, శానిటేషన్, ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్ విభాగాల అధికారులతో బౌద్ధ నగర్, అశోక్ నగర్, సంజీవ నగర్, వివిధ కాలనీలు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎక్కడ చూసినా ప్రజల సమస్యలు స్థానిక ఎమ్మెల్యే





పట్టించుకోవడంలేదని చెబుతున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా, ఉపసభాపతిగా పనిచేసి కూడా నియోజకవర్గ అభివృద్ధిని గాలికి వదిలేసారు. నేను బస్తీలో పర్యటిస్తుంటే ఎక్కడ చూసిన ప్రజలు వాళ్ళయొక్క సమస్యలు చెబుతున్నారు. తమ సమస్యలు పరిష్కారం దొరకలేదని చెబుతున్నారు. ఈ యొక్క సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని ఇంజనీరింగ్ విభాగం, శానిటేషన్ విభాగం, ఎలక్ట్రికల్ విభాగం, వాటర్ వర్క్స్ విభాగం అధికారులతో చర్చించి చెప్పడం జరిగింది. ఈ యొక్క కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అనిల్ కుమార్, కంటెస్టెడ్ కార్పొరేటర్ అమర్నాథ్ గౌడ్, షకీల్ బాయ్, వహీద్, బబ్లు, శ్రీకాంత్, లడ్డు, అలీమ్, నాయకులు, కార్యకర్తలు, బస్తీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## దారి మారదు మంజూరైన రోడ్ల సొమ్ము కాంట్రాక్టర్లకు వరం.



ములుగు జిల్లా ప్రతినిధి(శుభోదయం న్యూస్ ):: గ్రామాలలో రోడ్ల పరిస్థితి ఘోరం రోడ్లు వర్షాకాలం వస్తే రెండు అడుగుల వరకు దిగబడిన రోడ్లు నడవలేక ప్రజల అవస్థలు పడి కాలం గడిచినది. ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు ) మండలంలోని బీసీ మర్రిగూడెం గ్రామపంచాయతీలో మట్టి రోడ్ల దుస్థితి, ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. ప్రతి సంవత్సరం కాంట్రాక్టర్లకు రోడ్డు మరమ్మత్తుల కనీ లీజుకు తీసుకొని దారి మీద ఏదో ఒక బంక మట్టి పోయటం అది కాస్త వర్షానికి నాని వుబిలా తయారై గ్రామ ప్రజలు నడవడానికి వీలు లేకుండా తయారై మట్టి బంక కాళ్లకు దిగబడి కాళ్ళను పీక్కోలేక అవస్థలు పాడేవారు. ఈసారి అదేవిధంగా మట్టి 45 రోజుల క్రితం దారికి అడ్డంగా పోసి కాంట్రాక్టర్ పట్టించుకోకుండా, సెక్రటరీ గ్రామ పంచాయతీ అధికారి కూడా పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అటు వైపు కూడా చూడలేదు. ద్విచక్ర వాహనాలు, ట్రాక్టర్లు, ఆటోలు మరియు ఎడ్ల బండ్లు తిరగకుండా అడ్డంగా కుప్పగా మట్టి పోసి వదిలిపెట్టి కాంట్రాక్టర్ జాడ లేకుండా పోయాడు. మట్టి పోయాక ముందు పెద్ద కాలువగా ఏర్పడిన దారివెంబడి ఎంతో కొంత నడిచేవారు. మునుపు నాశరకం తూరలు వేసి పని దులుపుకొని కాసులు కాజేశారు. పంచాయతీ సెక్రటరీ గాని, ప్రభుత్వ సంబంధిత అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. కాసుల కక్కుర్తి కోసం నాసిరకం తూరలు వేసి దానిపైన బంక మట్టి పోసి సొమ్ములు కాజేశారు. వర్షాకాలం వానలు అధికంగా పడటం వలన తూరల పై బంక మట్టి పోయడంతో నాసిరకం తూరలు విరిగిపోయి దారికి పెద్ద గాడి ఏర్పడినది, గాడి పూడ్చటానికి డబ్బు మంజూరు అవటం అధికారులు కాంట్రాక్టర్లు కలిసి మంజూరైన పైకాన్ని మింగేయటం దారి పరిస్థితి యధాతథంగా ఉండి పోవడం జరిగింది. బిసి మరి గూడెం గ్రామపంచాయతీ ప్రజలు గో డు ఎల్ల బోసుకున్న ప్రయోజనం లేకపోయినది చెవిటోని చెవిలో శంఖం ఊదినట్లే ఉంది. ప్రజలే ఓడిపోయారు గాని అధికారులు నిమ్మకు నీరె త్తినట్టు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన చెందటం తప్ప దారి మారటం లేదు. అధికారులు ఇకనైనా కళ్ళు తెరవాలని ఇక్కడి ప్రజలు వాపోతున్నారు.

## ఈనెల 25న రామగుండం నియోజకవర్గం బి.ఆర్.ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం

### రామగుండం మాజీ ఎమ్మెల్యే బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్



గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) రామగుండం నియోజకవర్గ బి.ఆర్.ఎస్ పార్టీ విస్తృత స్దాయి సమావేశం ఈ నెల 25 వ తేది ఉదయం 10 గంటలకు సమావేశం (అనంతరం భోజనం)గోదావరిఖని పట్టణం మార్కండేయ కాలనీ శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్లో నిర్వహించినున్నట్లు రామగుండం మాజీ ఎమ్మెల్యే బిఆర్ఎస్ పార్టీ జిల్లాఅధ్యక్షుడు కోరుకంటి చందర్ తెలిపారు.ఈ సమావేశం లో రామగుండం నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ భవిష్యత్తు కార్యచరణపై చర్చించనున్నట్లుతెలిపారు.ఈ సమావేశానికిరామగుండంనియోజకవర్గంలోని మాజీ జడ్పీటీసిలు మాజీ ఎంపిపిలు ఎంపీటీసీలు,మాజీ కార్పోరేటర్లు మాజీ సర్పంచ్ లు మాజీ ఉప సర్పంచ్ లు, వార్డ్ మెంబర్స్, మాజీ మార్కెట్ కమిటీ సభ్యులు,ఫ్యాక్స్ కమిటి సభ్యులు,మండల పట్టణ నాయకులు, కార్యకర్తలు ఉద్యమకారులు, హజరు కావాలని మాజీ ఎమ్మెల్యే పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు నియోజకవర్గం ఇంచార్జి కోరుకంటి చందర్ కోరారు.

## రక్తదానంతో ప్రాణం నిలిపిన జాగృతి యువజన నాయకుడు తోట హరీష్ గౌడ్

### గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో బ్లడ్ బ్యాంకులో అన్ని సదుపాయాలు కల్పించాలి




గోదావరిఖని టౌన్ రిపోర్టర్- సురేష్,(శుభోదయం న్యూస్) గోదావరిఖని ప్రభుత్వాసుపత్రి లో కిడ్నీ సమస్యతో బాధపడుతున్న కడు నిరుపేద అయినా మాదరబోయిన సత్తయ్య ఆరోగ్యం చాలా విషమంగా, అత్యవసరంగా అరుదైన %శీ%- నెగటివ్ రక్తం పిబిసిపి పరీక్షలతో కూడిన రక్తం కావలసి వచ్చింది కానీ మన గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో పిబీసీపీ లేని వలన మంచిర్యాల నుంచి తేవాల్సిఉండగా అయినవాళ్లు ఎవరు అదుకొని పరిస్థితుల్లో దిక్కుతోచని స్థితిలో ఉన్న సత్తయ్య గారి భార్య పద్మ స్థానిక జాగృతి నాయకులు తెలియజేయగా వెంటనే స్పందించిన జాగృతి యువజన నాయకులు బొగ్గుల సాయి కృష్ణ, విద్యార్థినాయకులు తోట హరీష్ గౌడ్, జాగృతి యువజన సభ్యుడైన తంగళ్ళపల్లి రమేష్, మంచిర్యాలకు వెళ్లి రక్త దానం చేసి పిబీసీపి పరీక్షలతో కూడిన రక్తం గోదావరిఖనిలో చికిత్స పొందుతున్న బాధితులకు అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా జాగృతి నాయకులు మాట్లాడుతూ కార్పొరేషన్ స్థాయిలో ఉన్నటువంటి గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రిలో పీబీసీపీ వంటి సదుపాయాలు లేకపోవడం వలన ఆసుపత్రి కి వచ్చే రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో బ్లడ్ స్టోరేజ్ సెంటర్ ని ఇక్కడ ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే బ్లడ్ స్టోర్ కి సంబంధించిన అన్ని రకాల సదుపాయాలను ఏర్పాటుచేసి అన్ని రకాల పరీక్షలను ప్రధాన పట్టణ ఆసుపత్రిలోనే ఏర్పాటు చేయాలని, మంచిర్యాలకు వెళ్లే ఇబ్బందికర పరిస్థితుల నుంచి రోగులకు విముక్తి కల్పించాలని జాగృతి నాయకులు విజ్ఞప్తి చేశారు.



## మానవత్వం చాటుకున్న బుక్క బిక్షపతి రాళ్లకత్వ అశోక్ అభినందించిన దుకాణాల యజమానులు

## కృతజ్ఞతలు తెలిపిన బాధితులు



జిన్నారం : (శుభోదయం న్యూస్)జిన్నారం మండల కేంద్రంలో ఆదివారం మానవత్వం ఇంకా బతికి ఉందని చెప్పడానికి ఉదాహరణ బుక్క బిక్షపతి రాళ్లకత్వ అశోక్ గోమారం పెళ్లికి వెళ్తున్న వారు వాళ్ల పర్సు రోడ్డుపై పడిపోయింది వెంటనే గమనించిన బుక్క బిక్షపతి అశోక్ వెంటనే వెళ్లి ఆ పర్సన్ సేకరించి వారిని పిలవడం జరిగింది వారు గోమారం వెళ్తున్నారని తెలుసుకొని పక్కవారి దగ్గర వాళ్ల ఫోన్ నెంబర్ సేకరించి వారికి ఫోన్ చేసి వాళ్లకు పర్సును అందజేయడం జరిగింది. పర్సులో విలువైన వస్తువు ఉన్నాయి. వారు ఒక బైకుపై వాళ్ళు తిరిగి వచ్చి వీళ్లకు ధన్యవాదాలు తెలియజేసి పర్సు తీసుకొని వాళ్ళ సామగ్రిని చెక్ చేసుకొని వాళ్లను అభినందించి వెళ్లారు పక్క ఉన్న మిగతా షాపులు వాళ్లు కూడా వీళ్లను అభినందించడం జరిగింది. మానవత్వం బతికి ఉందని చెప్పడానికి ఇదే నిదర్శనం ఈరోజుల్లో జేబులో ఉన్న పర్సులే కొట్టేస్తున్నారు కానీ వీరు చిత్తశుద్ధితో వారికి ఉన్న మానవత్వ భావంతో వాళ్ల నెంబరు సేకరించి వాళ్ళని పిలిపించి అందించారంటే వీళ్ళిద్దరికీ ప్రతి ఒక్కరూ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దోమడుగు రమేష్ పలు షాపు ఓనర్లు ఇతర గ్రామస్తులు ఉన్నారు.

## శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవానికి హాజరైన ఆదర్శ్ రెడ్డి




పటాన్చెరు : (శుభోదయం న్యూస్)రామచంద్రపురం పట్టణం లో కురుమ సంఘం ఆధ్వర్యం లో నిర్వహించిన శ్రీ భ్రమరాంబికా మల్లికార్జున స్వామి వారి కళ్యాణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆదర్శ్ రెడ్డి పటాన్చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరైనారు. వారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువతో ఘనంగా సన్మానించారు. వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మల్లికార్జున స్వామి దేవాలయ ఉత్సవాలను జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. మల్లికార్జున స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు సుభిక్షంగా ఉండి సుఖశాంతులతో ఉండే విధంగా దేవుడు ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, బిఆర్ఎస్వి జిల్లా కోఆర్డినేటర్ చిన్న,నరసింహ,ఊరెళ్ళ రాజు,కురుమ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న జిఎంఆర్



పటాన్చెరు : (శుభోదయం న్యూస్) రామచంద్రపురం మందుముల శ్రీనివాస్ నగర్ కాలనీ లో ఉన్న శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి(మల్లన్న గుడి) ఆలయంలో ఆలయ కమిటీ ద్వారా జరుగుతున్న మల్లన్న జాతర,శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణమహోత్సవ కార్యక్రమంలో పటాన్చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రపురం కార్పొరేటర్ పుష్ప నాగేష్ ఆలయ కమిటీ సభ్యులు కురుమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా రామారావు...



అనంతగిరి. ఫిబ్రవరి.23 (శుభోదయం న్యూస్):సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా అనంతగిరి మండలం ఖానాపురం గ్రామానికి చెందిన గ్రందే రామారావును నియమిస్తూ ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు నియమక పత్రాన్ని ఆదివారం అందజేశారు.. కోదాడ పట్టణంలోని టిటిడి కళ్యాణ మండపం లో ఏర్పాటుచేసిన ఆర్యవైశ్య సంఘం ముఖ్య నాయకుల సమావేశం లో నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా రామారావుమాట్లాడుతూ... నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పజెప్పిన అధ్యక్షునికి సహకరించిన ఆర్యవైశ్య పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్యవైశ్యులకు ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తానని తన దృష్టికి వచ్చిన ఏ సమస్య అయినా పరిష్కరించే విధంగా కృషి చేస్తానని తెలిపారు..

## లింగమంతుల స్వామి జాతరలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్..



అనంతగిరి. ఫిబ్రవరి.23 (శుభోదయం న్యూస్.):యాదవుల ఇలవేల్పు, ఆరాధ్యదైవం లింగమంతుల స్వామి అని కోదాడ మాజి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు.మండల పరిధిలోని వాయిల సింగారం గ్రామంలో అట్టహాసంగా ప్రారంభమైన లింగమంతుల స్వామి,యలమంచమ్మ తల్లి జాతరకు ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ కు యదవలు ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో నిర్వహించే జాతరలు మన సంస్కృతి సాంప్రదాయాలకు వారధి అన్నారు.జాతరల తో గ్రామాల్లో ఆధ్యాత్మిక వాతావరణం అలవడంతో పాటు ప్రజల మధ్య ఐక్యమత్యం వెల్లివిరుస్తుందన్నారు.లింగమంతుల స్వామి యాదవుల ఆరాధ్య దైవం అని లింగ నామస్మరణతో తమ వారంతా బాగుండాలంటూ మొక్కులు తీర్చుకుంటారని తెలిపారు.అనంతరం యాదవ కులస్తుల మహిళలు గంపలు నెత్తినెత్తుకొని బోనాలు సమర్పించేందుకు బారులు తీరారు.జామల గుట్ట పై వెలిసిన లింగమంతుల స్వామి ఆలయం కు చేరుకున్న అనంతరం మొక్కులు చెల్లించుకున్నారు.లింగమంతుల స్వామి,యలమంచమ్మ తల్లిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో పెద్ద గోల సైదులు, పెద్ద గొల్ల బుర్ర వెంకన్న,బుర్ర బాబు,బుర్ర చిన్న వెంకన్న,నేరెళ్ల సైదులు,కాకాని వెంకటేశ్వర్లు తదితరులు పెద్దలు మహిళలు పాల్గొన్నారు.



శుభోదయం

సంపాదకీయం

# కొత్త రాజకీయ శకంవైపు జర్మనీ

## (విశ్లేషణ)

కొత్త రాజకీయ శకానికి నాంది పలకడానికి దాదాపు 60 మిలియన్ జర్మన్లు ఎన్నికల్లో ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. 27 దేశాలతో కూడిన యూరప్ యూనియన్‌లో అత్యంత బలోపేతమైన దేశం జర్మనీయే నాటోకు నాయకత్వం వహిస్తోంది. రష్యాతో యుద్ధం సాగిస్తోన్న ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేసే ప్రధాన దేశాల్లో జర్మనీ రెండోది. మొత్తం 84 మిలియన్ జనాభా కలిగిన జర్మనీలో 59.2 మిలియన్ మంది ఓటర్లు ఉన్నారు. ఇంత ప్రాధాన్యం కలిగిన జర్మనీలో కొత్త రాజకీయ పరిణామాలు ఏర్పడనున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మిత్రదేశాలు జర్మనీ అంతర్జాతీయ పాత్రలో ఓటు విలువ ఏమిటో నిశితంగా పరిశీలిస్తున్నాయి. ఆర్థిక సంక్షోభంతోపాటు అక్రమ వలసలతో సతమతమవుతున్న జర్మనీలో ఈసారి ఎన్నికలు ఆయా పార్టీలకు అగ్నిపరీక్ష కానున్నాయి. 2010 దశకంలో జర్మనీలోకి వలసలు పోటెత్తడం రానురాను తీవ్ర సమస్యగా పరిణమించింది. దీంతో అక్రమ వలసలను అరికట్టడంతోపాటు శరణార్థుల గుర్తింపు నిబంధనలు కఠినతరం చేయాలన్న డిమాండ్లు తెరముందుకు వస్తున్నాయి.గత ఏడాది నవంబరు 6న జర్మనీ సంకీర్ణ ప్రభుత్వం కూలిపోయినప్పటి నుండి మైనారిటీ ప్రభుత్వానికి జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్ నాయకత్వం వహిస్తున్నారు. డిసెంబర్‌లో జర్మనీ ఛాన్సలర్ ఓలాఫ్ షోల్జ్ పార్లమెంట్ విశ్వాసం కోల్పోయిన సంగతి తెలిసిందే. 733 మంది సభ్యులున్న సభలో ఆనాడు ఓటింగ్ జరగ్గా, ఆయనకు అనుకూలంగా కేవలం 207 ఓట్లే వచ్చాయి. వ్యతిరేకంగా 394 మంది ఓటేశారు. 116 మంది గైర్హాజరయ్యారు. మెజారిటీకి 367 కావలసి ఉంది. నిర్ణీత సమయం కంటే ఏడు నెలల ముందుగా అంటే ఫిబ్రవరిలో ఎన్నికలు జరపడానికి ప్రధాన పార్టీలన్నీ అంగీకరించాయి. ఈ నేపథ్యంలో ఆదివారం (ఫిబ్రవరి 23) జర్మనీలో ఎన్నికలు జరపడానికి అంతా సిద్ధమైంది.ప్రధాన పార్టీలకు ఈ ఎన్నికలు అత్యంత ప్రతిష్మాత్మకంగా తయారయ్యాయి. ఈసారి క్రిస్టియన్ డెమొక్రాటిక్ యూనియన్ (సిడియు) అధినేత ఫ్రిడిష్ మెర్జ్, సోషల్ డెమొక్రాటిక్ పార్టీ నేత, మాజీ ఛాన్సలర్ ఒలాఫ్ షోల్జ్, ఎఎఫ్‌డి పార్టీ నాయకురాలు ఎలీస్ వీడెల్, ది గ్రీన్స్/ అలయన్స్ 90 పార్టీ సారథి రాబర్ట్ హబెక్, ది సారా వాగెన్ కనెక్ట్ రీజన్ అండ్ జస్టిస్ పార్టీ (బిఎస్‌డబ్లు) సహ వ్యవస్థాపకురాలు సారా వాగెన్ కూడా పోటీలో ఉన్నారు. వీరిలో ఎఎఫ్‌డి నాయకురాలు ఎలీస్ వీడెల్, బిఎస్‌డబ్లు సహ వ్యవస్థాపకురాలు సారా మహిళా అభ్యర్థులు, వీరిలో ఎఎఫ్‌డి నాయకురాలు ఎలీస్ వీడెల్‌కు ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మద్దతు ఉంది. అమెరికా ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఇటీవల మ్యూనిక్‌కు వచ్చినప్పుడు ఈమెతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. యువతలో ఈమెకు పెద్ద క్రేజ్ ఉంది.వలసలు, ఇమ్మిగ్రేషన్‌కు విరుగుడుగా రిమిగ్రేషన్ (తిరిగి పంపేయడం) చట్టాన్ని తీసుకొస్తానని, జర్మనీపై రష్యా ఆంక్షలు ఎత్తివేసేలా కృషి చేస్తానని, ధ్వంసమైన నార్డ్ స్ట్రీమ్ పైప్‌లైన్‌ను పునరుద్ధరిస్తానని ఎన్నికల హామీలు గుప్పించారు. పర్యావరణ ఉద్యమ నేతగా ప్రఖ్యాతి వహించిన 55 ఏళ్ల రాబర్ట్ హబెక్, గతం లో షోల్జ్ ప్రభుత్వంలో వైస్ ఛాన్సలర్‌గా, ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారు. పునరుత్పాదక ఇంధన విధానాలకు పట్టం కడతానని, అధికారంలోకి వస్తే ఉక్రెయిన్‌కు సాయం కొనసాగిస్తానని, అణువిద్యుత్ శక్తి ఉత్పత్తిని తగ్గిస్తానని, పవన విద్యుత్‌ను పక్కన బెడతానని ఎన్నికల ప్రచారం సాగించారు. రష్యాకు మద్దతు పలుకుతూ తూర్పు జర్మనీలో బలమైన ఓటు బ్యాంకు సాధించిన ది సారా వాగెన్ కనెక్ట్ రీజన్ అండ్ జస్టిస్ పార్టీ అభ్యర్థి సారా వాగెన్ కనెక్ట్ తమ పార్టీ ఎఎఫ్‌డికి అసలైన ప్రత్యామ్నాయ పార్టీ అని చెబుతున్నారు. అయితే ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు అనుకూలంగా తమ వైఖరి కనిపిస్తుండటంతో ఈ పార్టీ గెలుపు అవకాశాలు సందేహంగా తయారయ్యాయి. క్రిస్టియన్ డెమొక్రాటిక్ యూనియన్ (సిడియు) అధినేత ఫ్రిడిష్ మెర్జ్ వైపు ఎక్కువ మంది మొగ్గు చూపే వీలుంది.

69 ఏళ్ల మెర్జ్ 2002లో ఏంజెలా మెర్కల్ ప్రభుత్వంలో పనిచేశారు, తరువాత రాజకీయాలను వదిలేసి అనేక పెట్టుబడుల బ్యాంకుల బోర్డుల్లో పనిచేశారు. తరువాత మళ్లీ సిడియు పార్టీలో చేరి పార్టీ నాయకత్వ పోరులో 2018లో మెర్కెల్, 2021లో ఆర్మిన్ లాసెట్ చేతిలో ఓటమి పొందారు. దేశ సరిహద్దులను పటిష్టం చేస్తానని, వలసలను కట్టడి చేసేలా శరణార్థి నిబంధనలను కఠినతరం చేస్తానని, పన్నులు తగ్గిస్తానని, సంక్షేమ పథకాల కోసం 50 బిలియన్ యూరోలను ఖర్చు చేయిస్తానని ఎన్నికల హామీలు గుప్పించారు.సోషల్ డెమొక్రాటిక్ పార్టీ నేత అయిన ఓలాఫ్ షోల్జ్ ఇప్పటికి మూడేళ్లకు పైగా దేశ ఛాన్సలర్‌గా సేవలందించారు. అయితే కూటమి సర్కార్‌ను నిలబెట్టుకోలేకపోయారు. రెండు నెలల క్రితం బలపరీక్షలో ఓడిపోయారు. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ప్రత్యక్షంగా జర్మనీ ఆర్థిక వ్యవస్థపై విపరీత ప్రభావం చూపించడంతో షోల్జ్ ప్రభుత్వ ప్రతిష్ఠ దెబ్బతింది. అది చివరకు కూలడానికి కారణమైంది. ఫ్రెడరిక్ మెర్జ్ సారథ్యంలోని క్రిస్టియన్ డెమొక్రాటిక్ యూనియన్ (సిడియు), మార్కస్ సోడర్ సారథ్యంలోని క్రిస్టియన్ సోషల్ యూనియన్ (సిఎస్‌యు) కూటమి ఈసారి ప్రజాభిమానంగా బరిలో దిగుతున్నాయి. ఈసారి ఈ కూటమికే విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఊహాగానాలు వెలువడుతున్నాయి. ఇప్పుడు ఈ ఎన్నికల్లో వలసలు, ఆర్థిక వ్యవస్థ మాత్రమే ప్రధాన అంశాలుగా ఉన్నాయి. జర్మనీ పార్లమెంట్ పీఠం ( బండేస్టాగ్) పై కూర్చునేది ఎవరనే అంశం ఇప్పుడు జర్మనీ అంతటా తీవ్ర చర్చనీయాంశం అవుతోంది.

# వంట నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించండి..

# ఊబకాయంపై ప్రధాని మోదీ ఆందోళన

ఊబకాయం సమస్యపై అంతా దృష్టి పెట్టాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. అనేక ఆరోగ్య సమస్యలకు ఊబకాయం కారణమవుతోందని తెలిపారు. కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే ఈ సమస్యను అధిగమించవచ్చుంటూ పేర్కొన్నారు. దేశంలో తలెత్తుతున్న తీవ్రమైన ఆరోగ్య సమస్య ఊబకాయం (స్థూలకాయం) అని.. దీనిపై ఇప్పటినుంచి అందరూ దృష్టిసారించాలని ప్రధాని మోదీ సూచించారు. దీనికోసం ప్రతి నెల వంట నూనె వినియోగాన్ని 10 శాతం తగ్గించాలని.. వంట నూనె కొనుగోలు చేసే సమయంలో 10 శాతం తక్కువగా కొనుగోలు చేయాలని మోదీ సూచించారు. ఆల్ ఇండియా రేడియో నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' (%మీుఅఅ ఖఉ దీుఫ్ 119ష్ట్ర జుజూఅంశీసవ%) తాజా ఎపిసోడ్‌లో.. ప్రధాని మోదీ ఊబకాయం గురించి ప్రత్యేకంగా మాట్లాడారు.. ఈ సందర్భంగా ఒక పరిశోధనను ఉదహరించారు.. నేడు ప్రతి ఎనిమిది మందిలో ఒకరు ఊబకాయం సమస్యతో బాధపడుతున్నారని, గత కొన్ని సంవత్సరాలుగా ఇటువంటి కేసులు రెట్టింపు అయ్యాయని అన్నారు. "పిల్లలలో ఊబకాయం సమస్య నాలుగు రెట్లు పెరగడం మరింత ఆందోళన కలిగించే విషయం" అని ఆయన అన్నారు. %ఔఊ% డేటా ప్రకారం, 2022లో, ప్రపంచవ్యాప్తంగా 250 మిలియన్లకు పైగా ప్రజలు ఊబకాయంతో బాధపడుతున్నారని.. వివరించారు. ఈ క్రమంలో ప్రతి నెలా ఆహారంలో 10 శాతం తక్కువ నూనెను ఉపయోగించాలని సూచించారు. ఇది సవాలుగా తీసుకోవాలని సూచించారు. అలా చేయడం ద్వారా.. వారు మరో 10 మందికి ఇలాంటి సవాలు విసరగలరంటూ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఒలింపిక్ బంగారు పతక విజేత నీరజ్ చోప్రా, బాక్సింగ్ క్రీడాకారిణి నిఖత్ జరీన్ సహా మరికొందరు ప్రముఖుల ఆడియో సందేశాలను కూడా ప్రధానమంత్రి వినిపించారు.. ఊబకాయాన్ని తగ్గించడానికి లేదా నివారించడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలను కోరారు. "ఆహారంలో నూనెను తక్కువగా ఉపయోగించడం.. ఊబకాయంతో పోరాడటం అనేది కేవలం వ్యక్తిగత ఎంపిక మాత్రమే కాదు.. కుటుంబం పట్ల మన బాధ్యత కూడా" అని ప్రధాని మోదీ అన్నారు. ఆహారంలో నూనెను అధికంగా వాడటం వల్ల గుండె జబ్బులు, మధుమేహం, అధిక ఒత్తిడి వంటి అనేక వ్యాధులు వస్తాయి. మన ఆహారపు అలవాట్లలో చిన్న చిన్న మార్పులు



చేసుకోవడం ద్వారా, మన భవిష్యత్తును బలంగా, ఆరోగ్యంగా, వ్యాధి రహితంగా మార్చుకోవచ్చు%" % అంటూ మోదీ సూచించారు.

కార్బోహైడ్రేట్ల వాడకాన్ని తగ్గించండి..

దేశంలోని ప్రఖ్యాత డాక్టర్ దేవి శెట్టి మాట్లాడుతూ.. దేశంలోని తీవ్రమైన ఆరోగ్య సమస్యలలో స్థూలకాయం ఒకటి. భారతదేశ యువత కూడా ఇప్పుడు దీనికి బలైపోతున్నారు. దీని వెనుక ప్రధాన కారణం ఒకరి జీవనశైలిలో చెడు ఆహారపు అలవాట్లను చేర్చడమేనని ఆయన అన్నారు. కార్బోహైడ్రేట్లను అధికంగా తీసుకోవడం వల్ల ఊబకాయం వస్తుందని ఆయన అన్నారు. మీ ఆహారంలో బియ్యం, బ్రెడ్, చక్కెరను అధిక మొత్తంలో తీసుకోవడం.. దీనితో పాటు, ఆహారంలో అధిక నూనె వాడటం వల్ల కూడా ఊబకాయం సమస్య వస్తుంది. దీని వల్ల గుండె జబ్బులు, బిపి, ఫ్యాటీ లివర్ వంటి తీవ్రమైన వ్యాధులు తలెత్తుతాయి. దీనికోసం, అందరు యువత తమ ఆహారాన్ని నియంత్రించుకోవాలి.. ప్రతిరోజూ వ్యాయామం చేయాలి.. అని సూచించారు.

# బడా నేతల పుట్టినిల్లు డీయూ.. జైట్లీ నుంచి రేఖా వరకూ..

న్యూఢిల్లీ: దేశంలో పేరెన్నికగన్న విద్యాలయాల్లో ఢిల్లీ విశ్వవిద్యాలయం(డీయూ) ఒకటి. ఈ వర్శిటీ అనుబంధ కళాశాలల్లో చదివిన పలువురు పెద్ద రాజకీయ నేతలుగా ఎదిగారు. వీరిలో చాలామంది క్రియాశీల రాజకీయాల్లో చురుకుగా వ్యవహరిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నారు. ఢిల్లీ యూనివర్శిటీ పరిధిలోని వివిధ కళాశాల్లో చదివి బడా నేతలుగా ఎదిగిన వారి జాబితాలో అరుణ్ జైట్లీ, శశి థరూర్ మొదలుకొని మొన్ననే ఢిల్లీ పీఠమెక్కిన రేఖాగుప్తా కూడా ఉన్నారు. మరి.. వీరిలో ఎవరెవరు ఏ కాలేజీలో చదివారనే వివరాల్లోకి వెళితే..

శ్రీ రామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్

అరుణ్ జైట్లీ: మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 1973లో ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని శ్రీ రామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ నుండి బి.కామ్ ఆనర్స్ డిగ్రీని అందుకున్నారు. 1977లో ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని ఫ్యాకల్టీ ఆఫ్ లా నుండి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు.

జయ్ గోయెల్: కేంద్ర మాజీ మంత్రి విజయ్ గోయెల్ శ్రీ రామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ నుండి ఎం.కామ్ పట్టా పొందారు.

జితిన్ ప్రసాద్: కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి జితిన్ ప్రసాద్.. శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ నుండి వాణిజ్యంలో డిగ్రీ పట్టా పొందారు.

సెయింట్ స్టీఫెన్స్ కళాశాల

శశి థరూర్: కాంగ్రెస్ నేత, ఎంపీ శశి థరూర్ 1975లో సెయింట్ స్టీఫెన్స్ కళాశాల నుండి హిస్టరీలో బ్యాచిలర్ డిగ్రీని పొందారు.

మణిశంకర్ అయ్యర్: కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి మణిశంకర్ అయ్యర్(%మీుఅఅ రాష్ట్రుఅఝుతీ ×ఎవతీ%) సెయింట్ స్టీఫెన్స్ కళాశాల నుండి ఆర్థిక శాస్త్రంలో బీ.ఎ. పట్టా పొందారు.

వీరభద్ర సింగ్: మాజీ కేంద్ర మంత్రి వీరభద్ర సింగ్ సెయింట్ స్టీఫెన్స్ కళాశాల నుండి బీ.ఎ. ఆనర్స్ డిగ్రీని అందుకున్నారు.

ఖుష్వంత్ సింగ్: ఖుష్వంత్ సింగ్ రచయితగా, న్యాయవాదిగా, పాత్రికేయునిగా, దౌత్యవేత్తగా పేరొందారు. ఈయన సెయింట్ స్టీఫెన్స్ కళాశాలలో చదువుకున్నారు.

హిందూ కళాశాల

డాక్టర్ సుబ్రమణియన్ స్వామి: రాజకీయవేత్త, ఆర్థికవేత్త, క్యాబినెట్ మాజీ మంత్రి డాక్టర్ సుబ్రమణియన్ స్వామి హిందూ కళాశాల నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

రావు ఇంద్రజిత్ సింగ్: భారత ప్రభుత్వ మాజీ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) రావు ఇంద్రజిత్ సింగ్ హిందూ కళాశాల నుండి న్యాయశాస్త్రం అభ్యసించారు.



మీనాక్షి లేఖి: భారత ప్రభుత్వ మాజీ విదేశాంగ సహాయ మంత్రి మీనాక్షి లేఖి ఢిల్లీలోని హిందూ కళాశాల నుండి గ్రాడ్యుయేషన్ డిగ్రీ (బీఎస్సీ) పూర్తి చేశారు.

రాంజస్ కళాశాల

చౌదరి బ్రహ్మ ప్రకాష్: ఢిల్లీ మొదటి ముఖ్యమంత్రి చౌదరి బ్రహ్మ ప్రకాష్, ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని రాంజస్ కళాశాల నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

సోమనాథ్ భారతి: ఢిల్లీ న్యాయశాఖ మాజీ మంత్రి సోమనాథ్ భారతి, రాంజస్ కళాశాల నుండి న్యాయశాస్త్రం అభ్యసించారు.

సరూప్ సింగ్: 1990లో మొదట కేరళ గవర్నర్‌గా, ఆ తర్వాత గుజరాత్ గవర్నర్‌గా పనిచేసిన సరూప్ సింగ్, రాంజస్ కళాశాల నుండి బీ.ఎ. ఇంగ్లీష్ చదివారు.

కిరోరి మాల్ కళాశాల

నవీన్ పట్నాయక్: ఒడిశా మాజీ ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని కిరోరి మాల్ కళాశాల నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ డిగ్రీని పొందారు.

మదన్‌లాల్ ఖురానా: ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, మదన్‌లాల్ ఖురానా ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని కిరోరి మాల్ కళాశాల నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

ప్రవేశ్ వర్మ: ప్రవేశ్ వర్మ ప్రస్తుత ఢిల్లీ బీజేపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. ఈయన ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలోని కిరోరి మాల్ కళాశాల నుండి బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ చదివారు.

హన్స్‌రాజ్ కళాశాల

కిరణ్ రిజిజు: కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. హన్స్‌రాజ్ కళాశాల నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

అజయ్ మాకెన్: ప్రస్తుత ఢిల్లీ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అజయ్ మాకెన్ హన్స్‌రాజ్ కళాశాల నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

లేడీ శ్రీ రామ్ కాలేజ్ ఫర్ ఉమెన్

అనుప్రియ పటేల్: పార్లమెంటు సభ్యురాలు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మాజీ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ లేడీ శ్రీరామ్ మహిళా కళాశాల నుండి బీ.ఎ. పట్టా పొందారు.

మేనకా గాంధీ: మాజీ ఎంపీ, మహిళా, శిశు అభివృద్ధి మాజీ మంత్రి, జంతు హక్కుల కార్యకర్త, పర్యావరణవేత్త మేనకా గాంధీ ఢిల్లీలోని లేడీ శ్రీరామ్ కళాశాల నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

దయాల్ సింగ్ కళాశాల

పంకజ్ సింగ్: ఉత్తరప్రదేశ్ బీజేపీ ఉపాధ్యక్షుడు, నోయిడా ఎమ్మెల్యే పంకజ్ సింగ్ 1999లో ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని దయాళ్ సింగ్ కళాశాల నుండి బీ.కాం. పట్టా పొందారు. ఆయన దేశ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కుమారుడు.

అల్కా లాంబా: జాతీయ కాంగ్రెస్ మహిళా నేత అల్కా లాంబా 1996లో దయాళ్ సింగ్ కళాశాల నుండి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు.

దౌలత్ రామ్ కళాశాల

రేఖ గుప్తా: కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖ గుప్తా ఢిల్లీ విశ్వవిద్యాలయంలోని దౌలత్ రామ్ కళాశాల నుండి బీ.కాం. పట్టా అందుకున్నారు.

# అడుగులన్నీ శ్రీశైలం వైపే..

# శివనామస్మరణతో మారుమ్రోగుతున్న నల్లమల

కర్నూలు,: నల్లమల అడవులు శివనామ స్మరణతో మారు మ్రోగు తున్నాయి. ఎండను సైతం లెక్కచేయకుండా కొండలు కోనాలు దాటుతూ భక్తులు తమ భక్తిని చాటుకుంటున్నారు వెంకటాపురం నుంచి నల్లమల అడవులలొ పాదయాత్రతొ ఆకలి దప్పికను సైతం లెక్క చేయకుండా వందల కిలోమీటర్లు నడక మార్గంలో అక్కడక్కడ చెట్ల వద్ద చేదతీరుతున్నారు. మెట్ల మార్గంలో శ్రీశైలం సమీపంలోని కైలాస ద్వారం వద్దకు చేరుకుని శివ లింగానికి తల తాకించి కొరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారమైన శివయ్యకు మొక్కలు తీర్చుకుంటున్నారు. శ్రీశైం మల్లన్న భక్తులు కిలోమీటర్ల మేర కొండా కోనలు దాటుకుంటూ శ్రీశైలం సమీపంలోని కైలాసద్వారం వద్ద సేదతీరుతూ పాదయాత్ర కష్టాలన్ని శ్రీశైల మల్లన్నపై ఉంచి చేదతీరుతున్నారు. పాదయాత్రతో వచ్చే భక్తులకు దేవస్థానంతోపాటు జిల్లా అధికారులు కైలాసద్వారం, హటకేశ్వరం వద్ద వసతులు ఏర్పాట్లు చేశారు. దట్టమైన అటవీప్రాంతంలో నడక సాగించి బారీ షెడ్లలో కొంతసేపు భక్తులు సేదతీరుతూ శివయ్యకు మొక్కులు తీర్చుకుంటున్నారు. పాదయాత్ర చేసి అలసట చెందిన భక్తులకు దేవస్థానం వైద్యం కోసం అటవీప్రాంతంలో సుమారు 10 చోట్ల వైద్యశిబిరాలు, అలానే స్వచ్ఛంద సేవకులు కాళ్ల నొప్పులకు, ఒళ్లు నొప్పులకు, కాళ్ల బొబ్బలకు మెడిసిన్ ఇచ్చి భక్తుల సేవలో తరిస్తున్నారు. పాదయాత్ర చేసి అలసిపోయి వచ్చిన భక్తులకు దేవస్థానం అధికారులు స్వచ్ఛంద సేవా కర్తలు భక్తుల కోసం ఉచిత బోజనాలు ఏర్పాటు చేశారు. ఆకలితో వచ్చిన భక్తులకు భోజనాలు ఏర్పాటు చేయడంతో మల్లన్న భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కాలి బాటలో వచ్చే భక్తుల కోసం శ్రీశైల దేవస్థానం అధికారులు మార్గమధ్యంలో మంచినీటి ట్యాంక్‌లు కైలాసద్వారం వద్ద ఏర్పాటు చేశారు. భక్తుల దాహార్తిని తీర్చేందుకు మంచినీటి ట్యాంకర్లు నిరంతరం 10 ట్యాంకర్స్‌తో నీటి సరఫర చేస్తున్నారు.శ్రీశైల మల్లన్న భక్తుల పాదయాత్ర నంద్యాల జిల్లా ఆత్మకూరు నుంచి రోడ్డు మార్గం ద్వారా వెంకటాపురానికి చేరుకొని అక్కడినుండి అటవీ మార్గం ద్వారా కోసాయికట్ట వీరాంజనేయ స్వామి గుడి నాగులుటి వీరభద్ర స్వామి ఆలయం, దామర్లకుంట పెద్ద చెరువు, మఠం బావి, ధూమును కొలను కైలాస ద్వారం మీదుగా సుమారు



40 కిలోమీటర్లు నల్లమల్ల అడవులను దాటుకుంటూ శ్రీశైలానికి పాదయాత్ర భక్తులు చేరుకుంటారు. అయితే పాదయాత్ర భక్తులకు నాగులుటి వద్ద ఆహారము.. దామర్లకుంట,పెద్ద చెరువు వద్ద నీటి వసతి, ఆహార వసతి కల్పిస్తున్నారు. తిరిగి మఠంభావి, భీముని కొలను, కైలాస ద్వారం వద్ద నీటి వసతి ఏర్పాట్లు అధికారులు చేశారు. శ్రీశైల మల్లయ్య శంభో శంకర అంటూ శివనామ స్మరణతో కైలాసద్వారం నుంచి శ్రీశైలానికి లక్షల సంఖ్యలో శివ భక్తులు సాధారణ భక్తులు తండోపతండాలుగా రోడ్లపై పాదయాత్ర చేస్తున్నారు. వీరంతా శ్రీశైలం చేరుకుని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటున్నారు. మహాశివరాత్రి ఘడియలు దగ్గర పడడంతో లక్షలాదిగా భక్తులు శ్రీశైలం చేరుకుని స్వామిఅమ్మవార్ల బ్రహ్మోత్సవాలలో పాల్గొని దర్శనం చేసుకుని కర్పూర నీరాజనాలర్పిస్తున్నారు.

## ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్షనేతగా ఎన్నికైన అతిషీ..



న్యూఢిల్లీ : ఆప్‌నేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అతిషీ అసెంబ్లీ ప్రతిపక్షనేతగా ఎన్నికయ్యారు. కీలక పదవిని చేపట్టిన తొలి మహిళా నేతగా అతిషీ చరిత్రలో నిలిచారు. అదేవిధంగా రానున్న అసెంబ్లీ సెషన్‌లో ఒక మహిళా ప్రతిపక్ష నేతగా అతిషీ, ఢిల్లీ మహిళా ముఖ్యమంత్రిని మొదటిసారి ఎదుర్కోనున్నారు. ఆదివారం నిర్వహించిన ఆప్ శాసనసభా పక్ష సమావేశంలో అతిషీని ప్రతిపక్ష నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కీలక పదవి కోసం ఎమ్మెల్యే సంజీవ్ ఝా ఆమె పేరును ప్రతిపాదించారు. తనను విశ్వసించినందుకు ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్‌కు, శాసనసభా పక్షానికి అతిషీ ధన్యవాదాలు తెలిపారు. బలమైన ప్రతిపక్షం ప్రజల గొంతుకకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఢిల్లీ అసెంబ్లీ సమావేశాల మొదటి సెషన్ సోమవారం నుండి ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జరగనున్న సమావేశాల్లో గత ఆప్ ప్రభుత్వ పనితీరుపై కాగ్ నివేదికను సభలో ప్రవేశపెట్టనున్నట్లు బిజెపి పేర్కొంది.

## ముందుకు వెళ్లడం సాధ్యం కావడం లేదు




హైదరాబాద్ : " ముందుకు వెళ్లడం సాధ్యం కావడం లేదు.. ప్రయత్నం చేస్తున్నాం " అని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం ఉదయం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదం పై మంత్రి జూపల్లి కృష్ణారావు మరో కీలక ప్రకటన చేశారు. ఆయన ఓ మీడియా ఛానల్ ప్రతినిధితో మాట్లాడారు. కార్మికులు చిక్కుకున్న 100 మీటర్ల ప్రాంతం వరకు మంత్రి వెళ్లగలిగారు. అనంతరం మీడియాతో మంత్రి మాట్లాడుతూ .. పైకప్పు కూలడంతో మట్టి, బురద చేరుతోందన్నారు. రెస్క్యూ టీమ్ ఇంకా ముందుకు వెళ్లడం సాధ్యం కావడంలేదని, ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. పరిస్థితిని అధికారులతో కలిసి నిత్యం పరీక్షిస్తున్నామని అన్నారు. ఇదిలా ఉండగా %ొ% నాలుగు గంటల తరువాత టన్నెల్ నుంచి ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందం తిరిగి వచ్చింది. 12 కిలో మీటర్లు అండర్ టన్నెల్ ట్రైన్‌లో ప్రయాణించి అక్కడి నుండి రెండు కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లారు. మోకాలు లోతు వరకు నీరు నిండి ఉండడంతో ముందుకు వెళ్లలేకపోయారు. మొత్తం ఆరు మీటర్ల మీద బురదతో నిండిపోయిందని అధికారులు చెబుతున్నారు. ప్లై కెమెరాతో లోపల దృశ్యాలను చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. సాంకేతిక మిషనరీతో లోపలికి వెళ్లాలని ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలు చెబుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో మరోసారి లోపలికి వెళ్లడానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

## సైన్స్ పట్ల యువతకు ఆసక్తి కలిగించాలి



న్యూఢిల్లీ : సైన్స్ పట్ల యువత, చిన్నారులకు ఆసక్తి కలిగించడం చాలా ముఖ్యమని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఆదివారం మన్‌కీబాత్‌లో ఆయన నేషనల్ సైన్స్ డే గురించి మాట్లాడారు. సైన్స్ పట్ల అవగాహన పెంచేందుకు 'శాస్త్రవేత్తగా ఒకరోజు' వ్యవహరించాలని యువత, చిన్నారులకు సూచించారు. ఒకరోజు తప్పనిసరిగా మీకు దగ్గరలోని రీసెర్చ్ ల్యాబ్, ప్లానిటోరియం లేదా సైన్స్ సెంటర్ వంటి ప్రదేశాలను సందర్శించాలని సూచించారు. తన రాకెట్ ప్రయోగాల్లో సెంచరీ సాధించిన భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను ప్రశంసించారు. గత నెల ఇస్రో 100వ రాకెట్ ప్రయోగానికి దేశం సాక్షిగా నిలిచిందని అన్నారు. అడుగడుగునా సవాళ్లు ఎదురైనా మన శాస్త్రవేత్తలు వాటిపై విజయం సాధిస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. గడిచిన పదేళ్లలో సుమారు 460 ఉపగ్రహాలను ప్రయోగించామని, వాటిలో ఇతర దేశాలకు చెందినవి కూడా ఉన్నాయని అన్నారు. అంతరిక్ష శాస్త్రవేత్తల బృందంలో మహిళల భాగస్వామ్యం నిరంతరం పెరుగుతుండటం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.

## వామ్మో.. ఈ రైళ్లు ఇంతలేటా.. ఇక కుంభమేళాకు వెళ్లినట్లే!




న్యూఢిల్లీ : యూపీలో జరుగుతున్న మహాకుంభమేళా మరో మూడు రోజుల్లో అంటే ఫిబ్రవరి 26న శివరాత్రితో ముగియనుంది. దీంతో బీహార్ నుంచి ప్రయాగ్‌రాజ్ వెళ్లాలనుకుంటున్న భక్తులు పలు రైళ్లను ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో పట్నా జంక్షన్‌తోపాటు బీహార్‌లోని పలు రైల్వేస్టేషన్‌లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. ప్రయాగ్‌రాజ్ వెళ్లే రైళ్లలోకి ఎలాగైనా ఎక్కాలని పలువురు ప్రయాణికులు ప్రయత్నిస్తున్నారు. దీంతో వారిని నిలువరించడం రైల్వే పోలీసులకు కష్టంగా మారింది. కాగా ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, రైల్వేశాఖ పలు ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. అయితే ఈ రైళు ్ల ఊహకందనంత లేటుగా నడుస్తున్నాయి. బీహార్ లోని పట్నా మీదుగా 10 రైళ్లు నడుస్తున్నాయి. అయితే ఇవన్నీ చాలా ఆలస్యంగా రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రయాగ్‌రాజ్ నుంచి పట్నా వచ్చే ప్రత్యేక రైలు (23320) ఏకంగా 37 గంటలు లేటుగా గమ్యస్థానానికి చేరుకుంది. గురువారం మధ్యాహ్నం 12:30కు ప్రయాగ్‌రాజ్ నుంచి బయలుదేరిన ఈ రైలు శనివారం రాత్రి 10:18కి పట్నా జంక్షన్ చేరుకుంది. ఇదేవిధంగా సిక్కిం ఎక్స్‌ప్రెస్ కూడా శనివారం 20 గంటలు లేటుగా పట్నా చేరుకుంది. అనన్‌సోల్ మహాకుంభ్ రైలు 9 గంటలు ఆలస్యంగా నడిచింది. కామాఖ్య నుంచి బయలుదేరిన కుంభమేళా స్పెషల్ రైలు నాలుగు గంటలు లేటుగా గమ్యస్థానానికి చేరుకుంది.

# సుంకాల భారం అమెరికాపైనే!

**ఫార్మా ఎగుమతులపై అగ్రరాజ్యం ప్రతీకార సుంకాలు విధించకపోవచ్చంటున్న భారత కంపెనీలు**

**ఔషధ దిగుమతులపై ఆధారపడినందున పన్నుల వడ్డనపై వెనక్కితగ్గే అవకాశం ఉందని అంచనా**

**ఒకవేళ ప్రతీకార సుంకాలు విధిస్తే నష్టం ఆ దేశానికే ఉంటుందని స్పష్టీకరణ**





ఔషధాలు, ఆటోమొబైల్, సెమికండక్టర్ దిగుమతులపై దాదాపు 25 శాతం లేదా అంతకంటే ఎక్కువ సుంకాలను విధించాలని యోచిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించిన సంగతి తెలిసిందే. భారత్ నుంచి ఔషధ ఎగుమతుల్లో యూఎస్ మార్కెట్ తొలి స్థానంలో ఉంది. అలాగే అమెరికా వినియోగిస్తున్న జనరిక్స్‌లో దాదాపు సగం వాటా భారత్ సమకూరుస్తోంది. దీంతో ట్రంప్ ని ర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. ఔషధ దిగుమతులపై ఆధారపడ్డ యూఎస్ ప్రతీకార పన్నుల విషయంలో ఒక అడుగు వెనక్కి వేసే అవకాశమే ఉందని భారతీయ ఫార్మా కంపెనీలు, నిపుణులు కుండబద్దలు కొడుతున్నారు. యూఎస్ వెలుపల అత్యధిక యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం పొందిన ఔషధ తయారీ ప్లాంట్లు ఉన్నది భారత్‌లోనే. పైగా ఇప్పటికిప్పుడు డిమాండ్‌కు తగ్గట్టుగా మందులను సరఫరా చేసే స్థాయిలో అక్కడి కంపెనీల సామర్థ్యం లేదు. ఇదంతా ఒక ఎత్తైతే ఒకవేళ ఔషధాలపై ప్రతీకార పన్నులు విధిస్తే తమపై ప్రభావం తక్కువేనని, దిగుమతుల భారం యూఎస్‌పైనే ఉంటుందని భారతీయ కంపెనీలు స్పష్టం చేస్తున్నాయి.

### ప్రధాన మార్కెట్‌గా యూఎస్..

భారత్ నుంచి ఎగుమతి అవుతున్న ఔషధాల్లో తొలి స్థానంలో ఉన్న యూఎస్ వాటా ఏకంగా 30 శాతంపైనే ఉంది. గత ఆర్థిక సంవత్సరంలో మన దేశం నుంచి రూ.75,385 కోట్ల విలువైన ఔషధాలు యూఎస్‌కు చేరాయి. ఇక యూఎస్ నుంచి భారత్‌కు వచ్చిన మందులు కేవలం రూ.5,199 కోట్ల విలువైనవి మాత్రమే. 2023-24లో భారత్ నుంచి వివిధ దేశాలకు మొత్తం ఔషధ ఎగుమతులు రూ.2,40,887 కోట్లు. ఇందులో జనరిక్ ఫార్ములేషన్స్ (ఫినిష్డ్ డోసేజ్) రూ.1,64,635 కోట్లు. అంతర్జాతీయంగా జనరిక్స్ మార్కెట్ పరిమాణం రూ.39,85,900 కోట్లు. 2030 నాటికి ఇది రూ.68,45,350 కోట్లకు చేరుకుంటుందన్న అంచనాలు ఉన్నాయి. ఆ సమయానికి భారత మార్కెట్ ఎగుమతులతో కలుపుకుని రూ.9,53,150-10,39,800 కోట్ల స్థాయికి చేరే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇది రూ.4,76,575 కోట్లు.

### చవకగా నాణ్యమైన ఔషధాలు..

నాణ్యమైన ఔషధాలను చవకగా తయారు చేయడం భారతీయ జనరిక్ కంపెనీల ప్రత్యేకత. కోట్లాది రూపాయలు వెచ్చించి యూఎస్ఎఫ్‌డీఏ అప్రూవల్స్ దక్కించుకున్న కంపెనీలు.. యూఎస్‌లో ఉన్న అపార అవకాశాలను కాదనుకునేందుకు సిద్ధంగా లేరని ఓ కంపెనీ ప్రతినిధి అన్నారు. ఎఫ్‌డీఏ ఆమోదం అంటేనే ప్రతిష్టగా భావిస్తారని అన్నారు. భారతీయ మందుల కారణంగా 2013-2022 మధ్య యూఎస్ ఆరోగ్య రంగం రూ.1,12,64,500 కోట్లు ఆదా చేసిందని నివేదికలు చెబుతున్నాయని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రాజ భాను తెలిపారు. నూతన, వినూత్న ఔషధాలను యూఎస్ నుంచి భారత్ దిగుమతి చేసుకుంటోంది.

### సిద్ధం కావడానికి నాలుగేళ్లు..

యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం కలిగిన తయారీ ప్లాంట్లు భారత్‌లో 650 దాకా ఉన్నాయి. ఈ ధ్రువీకరణ రావాలంటే ప్రమాణాలకు తగ్గట్టుగా ప్లాంటును సిద్ధం చేయడం, ఏఎన్‌డీఏ ఆమోదం, అనుమతులకు నాలుగేళ్లు పడుతుంది. ఇప్పటికిప్పుడు మరో దేశం నుంచి ఔషధాలను దిగుమతి చేసుకుందామని అనుకున్నా యూఎస్‌కు సాధ్యం కాదు. కోవిడ్ మహమ్మారి సమయంలో చైనా, భారత్‌లో ఎఫ్‌డీఏ తనిఖీలు ఆలస్యం అయ్యాయి. దీంతో సరఫరా తగ్గి యూఎస్‌లో ఔషధాల కొరత వచ్చింది. ఇటువంటి పరిస్థితుల్లో టారిఫ్‌లు విధించే అవకాశాలు లేవనే చెప్పవచ్చు. యూఎస్ నుంచి వచ్చే ఔషధాలపై దిగుమతి సుంకాన్ని భారత్ ఎత్తివేసే చాన్స్ ఉంది. యూఎస్‌లో తయారీ ప్లాంట్లు పెట్టాలన్నా అంత సులువు కాదు.

### వినియోగదారులపైనే భారం..

భారత్ నుంచి దిగుమతయ్యే ఔషధాలపై అమెరికా ప్రస్తుతం కేవలం 0.1 శాతం సుంకాన్ని విధిస్తోంది. ఇందుకు విరుద్ధంగా భారత్ 10 శాతం వసూలు చేస్తోంది. యూఎస్ వినియోగిస్తున్న జనరిక్స్‌లో సింహ భాగం భారత్ సమకూరుస్తోంది. భారత్‌లో తయారైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్‌పై (ఏపీఐ) యూఎస్ ఎక్కువగా ఆధారపడే అవకాశం ఉంది. ప్రతిపాదిత ప్రతీకార సుంకాలు కొన్ని జనరిక్స్ లాభదాయకతను ప్రభావితం చేయవచ్చు. కానీ ఆ భారాన్ని తుది వినియోగదారులకు బదిలీ చేసే అవకాశం ఉంది.

### ఏపీఐ కంపెనీలకు..

సుంకాలు విధిస్తే ఔషధాలు ప్రియం అవుతాయి. ఇదే జరిగితే యూఎస్ ప్రజలపైనే భారం పడుతుంది. అయితే దీని ప్రభావం ఫినిష్డ్ డోసేజ్ కంపెనీలపైనే ఉంటుంది. ఇక ఏపీఐ త యారీ సంస్థలకు మంచి రోజులు రానున్నాయి. భారత కంపెనీల నుంచే వీటి దిగుమతికి యూఎస్ ఆసక్తిగా ఉండడమే ఇందుకు కారణం. ప్రధానంగా ఆంకాలజీ విభాగంలో అవకాశాలు ఎక్కువ. యూఎస్ఎఫ్‌డీఏ ఆమోదం ఉన్న కంపెనీలకు ప్రయోజనం చేకూరుతుంది.

# మహా 'కాసుల' మేళా!

## రూ.3 లక్షల కోట్ల వ్యాపారం అంచనా వేస్తున్న సీఏఐటీ

మహా కుంభమేళా కాసులు కురిపిస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు కోట్లాది మంది భక్తులను ఆకర్షిస్తున్న ఈ వేడుక.. వస్తువులు, సేవల ద్వారా రూ.3 లక్షల కోట్లకు పైగా వ్యాపారం నమోదు చేయనుందని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (సీఏఐటీ) అంచనా వేసింది. ఇది భారత్‌లో అతిపెద్ద ఆర్థిక కార్యక్రమాలలో ఒకటిగా నిలిచిందని సీఏఐటీ సెక్రటరీ జనరల్, చాందినీ చౌక్ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ తెలిపారు. 144 ఏళ్లకోసారి జరిగే మహా కుంభమేళా జనవరి 13న ప్రారంభం కాగా ఈ నెల 26 వరకు కొనసాగనుంది. ప్రపంచంలోనే అతిపెద్ద మతపర, ఆధ్యాత్మిక సమావేశంగా గుర్తింపు పొందిన ఈ కుంభమేళాలో కోట్లాదిమంది భక్తులు పాల్గొన్నారు.

### అంచనాలను మించి..

విశ్వాసం, ఆర్థిక వ్యవస్థ మధ్య సంబంధాన్ని ఈ కార్యక్రమం దృఢంగా నిర్వచించిందని ఖండేల్వాల్ అన్నారు. 'డైరీలు, క్యాలెండర్లు, జనపనార సంచులు, స్టేషనరీ తదితర మహాకుంభ నేపథ్య ఉత్పత్తులకు డిమాండ్ పెరగడం స్థానిక వాణిజ్యాన్ని పెంచుతోంది. కచ్చితమైన బ్రాండింగ్ కారణంగా అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. మహా కుంభమేళా ప్రారంభానికి ముందు 40 కోట్ల మంది ప్రజలు వస్తారని అంచనా వేశారు. అలాగే దాదాపు రూ.2 లక్షల కోట్ల విలువైన వ్యాపార లావాదేవీలు జరుగుతాయని భావించారు. అయితే దేశవ్యాప్తంగా నెలకొన్న అపూర్వ ఉత్సాహం కారణంగా.. ఉత్సవాలు ముగిసే నాటికి ఇంకా భారీ సంఖ్యలో ఈ మహా కుంభమేళాలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. తద్వారా భారీ స్థాయిలో రూ.3 లక్షల కోట్లకు పైగా వ్యాపారం నమోదు అయ్యే అవకాశం ఉందని ఖండేల్వాల్ చెప్పారు.

### భారీగా ఆర్థిక కార్యకలాపాలు

ఉత్తరప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు ఈ కార్యక్రమం గణనీయ ప్రోత్సాహాన్ని అందించిందని, కొత్త వ్యాపార అవకాశాలను సృష్టించిందని సీఏఐటీ వెల్లడించింది. ఆతిథ్యం, వసతి, ఆహారం, పానీయాలు, రవాణా, మతపర దుస్తులు, పూజా సామగ్రి, హస్తకళలు,



వ్రస్తాలు, దుస్తు లు, వినియోగ వస్తువులు, ఆరోగ్య సంరక్షణ, వెల్‌నెస్ సేవలు, మీడియా, ప్రకటనలు, వినోదం, పౌర సేవలు, టెలికం, మొబైల్, ఏఐ ఆధారిత సాంకేతికత, సీసీటీవీ కెమెరాలు, ఇతర పరికరాలు వంటి అనేక వ్యాపార విభాగాల్లో పెద్ద ఎత్తున ఆర్థిక కార్యకలాపాలు నమోదయ్యాయని వివరించింది.

### 150 కిలోమీటర్ల పరిధిలో లబ్ధి

మహాకుంభ మేళా ఆర్థిక ప్రయోజనాలు ప్రయాగ్‌రాజ్‌కు మాత్రమే కాకుండా 150 కిలోమీటర్ల పరిధిలో ఉన్న నగరాలు, పట్టణాలకు కూడా విస్తరించాయి. అయోధ్య, వారణాసి, ఇతర మతపర ప్రదేశాలకు యాత్రికులు వెల్లువెత్తారు. మహాకుంభ మేళా భారత్‌లో వ్యాపారం, వాణిజ్యం, సాంస్కృతిక వ్యవస్థ రూపురేఖలను సానుకూలంగా మారుస్తుందని, ఏళ్ల తరబడి కొత్త రికార్డును సృష్టిస్తుందని భావిస్తున్నారు.

# నీరు, నీరు!



'నీటి పేరు వింటేనే జలజలలాడిపోతాం, నీటితనంతో ప్రాణులం, నిత్య జీవన తేజో విరాజితుల మౌతాం' అంటారు కవి ఎన్.గోపిగారు. నీటితోనే కదా జీవకోటి సజీవంగా కొనసాగుతున్నది. నీరు ప్రాణాధారం. స్వచ్ఛమైన నీటి కోసం, ఈ భూ ప్రపంచం మీది జనం ఎన్ని కన్నీళ్లు విడుస్తున్నారో కదా! నీరే మన తొంబై శాతం ఆరోగ్యాన్ని శాసించేది. నీరు కలుషితమైతే వ్యాధుల వెతలెన్నో మూగుతాయి. ఇంత ముఖ్యమైన, ప్రధానమైన విషయంపట్ల, అవసరంపట్ల మనం చూపిస్తున్న శ్రద్ధ మాత్రం వరుసలో చివరిది. ఈ భూమిపై ఉన్న మొత్తం నీటిలో 97శాతం సముద్రపు నీరే. మరో రెండు శాతం మంచు రూపంలోని నీరు. మిగిలిన ఒక్క శాతం కన్నా తక్కువగా ఉన్న మంచినీరు జీవ కోటికి పనికివొచ్చే నీరు. ఇట్లాంటి నీటిని ఎంత జాగ్రత్తగా వాడాలి. ఎంత స్వచ్ఛంగా చూసుకోవాలి! నీటిని నీటిలానే ఉంచుతున్నామా! ప్రకృతి సిద్ధమైన నీరును కాపాడుకొనే ఆలోచన మనకేమయినా ఉందా! లేదు గాక లేదు. కొంతకాలమయ్యాక చివరికి రేషను మాదిరిగా నీటిని కొలతలేసి పంచాల్సిన పరిస్థితి వస్తదేమో! ఇప్పటికే ప్రపంచంలో 31శాతం ప్రజలు నీటి కొరతతో ఇబ్బందులు పడుతున్నారు. 2030 నాటికి మన భారతదేశంలో 40శాతం ప్రజలు తాగునీటి కొరతతో, నీరు అందుబాటులో లేక జీవిస్తారని అంచనా వేస్తున్నారు. అందుకే ఈ నీటి వ్యాపారంలోకి బహుళజాతి సంస్థలు అడుగుపెట్టేసాయి. వేల కోట్ల రూపాయల వ్యాపారం చేస్తున్నాయి. ప్రజలందరికి రక్షిత మంచినీటిని అందించాల్సిన ప్రభుత్వాలు చేతులెత్తేస్తున్నాయి. అదొక అంతర్జాతీయ సమస్య. అదలా ఉంచితే, మన దేశంలో ప్రాణాధారమైన నీరు అందిస్తున్న నదులు, చెరువులు, సెలయేరులు ఎంతో కలుషితమైపోతున్నాయి. ప్రకృతిని మన అవసరాలకు వాడుకోవాల్సిందే, కానీ పరిశుభ్రంగా ఉంచడం బాధ్యత. తీసుకున్నంత ఇవ్వాలి. ఇచ్చినంత తీసుకోవాలి. అంతేకాని అరాచకంగా వాడితే అనర్థమే మిగులుతుంది. పారే నదుల నీటిలోనూ ప్లాస్టిక్ మొదలైన కాలుష్యాలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. మన దేశంలో నదులను పవిత్రంగా భావిస్తాము. నదిలో మునిగి పుణ్యస్నాన మాచరిస్తే పవిత్రులమైపోతామనే విశ్వాసాలు మెండు. కానీ మల మూత్రాలతో, మట్టితో, బూడిదతో, శవాలతో, బాటిళ్లతో, పాన్‌పరాకులతో, ప్యాకెట్లతో, మురికితో నింపిపోతాము. గంగా నది అంటే గొప్ప గౌరవం మనకు. కాలుష్య గంగగా మారిందెందుకు? ప్రక్షాళన జరిగేదెప్పుడు! ఏ నదీపూజలు చేయని చైనాలో నదులెంత శుభ్రంగా ఉన్నాయో చూడండి! కుంభమేళాల పేరుతో నది నీటిని విపరీతంగా కలుషితం చేస్తున్న తీరును మనం గమనిస్తూనే ఉన్నాము. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ లోని త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాల కోసం కోట్లాది మంది ప్రజలు విరుచుకుపడుతున్నారు. ఈ కుంభమేళా సందర్భంగా స్నానాలు చేస్తే పొందే పుణ్యం గురించి, ప్రయోజనాల గురించీ ప్రభుత్వం విపరీతంగా ప్రచారం చేసింది. తొక్కిసలాటలో ముప్పయి మందికిపైగా ప్రాణాలు కూడా పోయాయి. ఇప్పటికే యాభై కోట్ల మంది జనం నదిలో మునిగిపోయారు. దీంతో నది నీటిలో స్థాయికి మించిన ఫీకల్ కొలిఫామ్ బ్యాక్టీరియా పెరిగిందని, స్నానానికి ఈ నీరు పనికిరాదని సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నివేదికనిచ్చింది. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఎన్జీటీ కూడా కాలుష్యంపై ఆందోళన వ్యక్తం చేసింది. కానీ మన పేరుగాంచిన సనాతన ధర్మకుడు యోగిగారు, స్నానానికే కాదు, తాగడానికి కూడా అనుకూలమేనని దబాయిస్తున్నారు. "మిస్టర్ యోగి.. మీ మంత్రివర్గం మొత్తం కుంభమేళాలో స్నానం చేసిన నీటిని ఓ గ్లాస్ తాగి చూపించండ"ని ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ సవాలు విసిరారు. కుంభమేళా ప్రారంభానికి ముందు త్రివేణి సంగమ నీటిని పరీక్షించి ఇచ్చిన నివేదికను చూపి, నీటిని తాగవచ్చని ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడు తున్నారు. యోగుల స్వచ్ఛ కాలుష్య ప్రచారాలు ఇలా ఉన్నాయి. దేశ ప్రజలకు మంచినీటిని అన్ని గ్రామాలకు అందించలేని నాయకులు, ప్రజల విశ్వాసాలను రాజకీయాలకు ఉపయోగించుకోవటానికి ఏ మాత్రం సంకోచించటంలేదు. అసత్య ప్రచారానికీ పూనుకొంటున్నారు. ఇప్పటికి కుంభమేళా నిర్వహణకు ఏడు వేల కోట్ల రూపాయిల్ని కేటాయించి ఖర్చు చేస్తున్నది ప్రభుత్వం. దీని చుట్టూతా పెద్ద ఆర్థిక వ్యాపారమూ సాగుతున్నది. ప్రయాగ్‌రాజ్‌లో మూడు లక్షల కోట్ల వ్యాపారం జరుగుతోందని తెలిసింది. వ్యాపారులకు లాభాలు, ప్రభుత్వ సొమ్ము అంటే ప్రజల సొమ్ము నదుల పాలు, నదులు కాలుష్యం పాలు, ఇదీ మేళా జనసందోహపు సమీకరణం! ఇంకోవైపు చూడండి. ఎండాకాలం కుండలూ, బిందెలూ పట్టుకుని మైళ్లకు మైళ్లు మంచినీటి కోసం జనం బారులు తీరుతుంటారు. ఇది మన దేశ పురోభివృద్ధి దశ. ఇప్పటికైనా మేల్కోవాలి!

# షమీ చెత్త రికార్డు.. ఛాంపియన్స్ ట్రోఫీ చరిత్రలోనే..

# స్పోర్ట్స్ న్యూస్




టీమిండియా వెటరన్ బౌలర్ మహ్మద్ షమీ చెత్త రికార్డు నమోదు చేశాడు. పాకిస్తాన్ తో మ్యాచ్‌లో ఆరంభ ఓవర్లోనే ఏకంగా ఐదు వైడ్‌బాల్స్ వేశాడు. తద్వారా చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో ఇన్నింగ్స్ ఆరంభ ఓవర్లోనే అత్యధికంగా ఐదు అదనపు పరుగులు సమర్పించుకున్న రెండో బౌలర్‌గా నిలిచాడు.

### విజయంతో ఆరంభం

అంతేకాదు.. వన్డేల్లో భారత్ తరఫున ఇర్ఫాన్ పఠాన్, జహీర్ ఖాన్ పేరిట ఉన్న మరో చెత్త రికార్డును షమీ సమం చేశాడు. కాగా ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ-2025 పాకిస్తాన్ వేదికగా ఫిబ్రవరి 19న మొదలైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో దుబాయ్‌లో తమ తొలి మ్యాచ్ ఆడిన టీమిండియా విజయంతో ఈ మెగా టోర్నీని ఆరంభించింది.

### డాట్ బాల్స్, వైడ్‌లు

తాజాగా అదే వేదికపై చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో ఆదివారం నాటి మ్యాచ్‌లో టాస్ ఓడిన భారత్ తొలుత ఫీల్డింగ్ చేయగా.. వెటరన్ పేసర్ షమీ బౌలింగ్ అటాక్ ఆరంభించాడు. అయితే, తొలి బంతిని బాగానే వేసిన ఈ రైటార్మ్ పేసర్ రెండో బంతిని వైడ్‌గా వేశాడు. అనంతరం పరుగు ఇవ్వని షమీ.. ఆ తర్వాత మళ్లీ వరుసగా రెండు వైడ్లు వేశాడు. ఆ మరుసటి బంతికి పరుగులేమీ ఇవ్వని షమీ.. అనంతరం ఒక పరుగు ఇచ్చి.. మళ్లీ డాట్ బాల్ వేశాడు. కానీ ఆ తర్వాత మళ్లీ రెండు రెండు వైడ్లు వేయడంతో కెప్టెన్ రోహిత్ శర్మ కాస్త అసహనానికి గురయ్యాడు. అయితే, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి మాత్రం షమీని ఉత్సాహపరుస్తూ మరేం పర్లేదు అన్నట్లుగా ఊరటకలిగించాడు. ఇక ఆఖరి బంతిని డాట్ బాల్‌గా వేసిన షమీ తొలి ఓవర్లో వరుసగా 0 %ఔం 0 ఔం ఔం 0 1 0 ఔం ఔం% 0 నమోదు చేశాడు. అలా మొత్తంగా పదకొండు బాల్స్ వేశాడు.

### అత్యధిక వైడ్ బాల్స్ వేసిన క్రికెటర్ల జాబితాలో

తద్వారా చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో ఇలా ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే అత్యధిక వైడ్ బాల్స్ వేసిన క్రికెటర్ల జాబితాలో రెండో స్థానంలో నిలిచాడు. షమీ పాక్‌తో మ్యాచ్‌లో ఐదు వైడ్‌బాల్స్ వేయగా.. అంతకు ముందు జింబాబ్వే క్రికెటర్ టినాషే పన్యంగర 2004లో బర్మింగ్‌హామ్ వేదికగా ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఏకంగా ఏడు వైడ్ బాల్స్ వేసి ఈ జాబితాలో మొదటి స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక వన్డేల్లో తొలి ఓవర్లో టీమిండియా తరఫున అత్యధిక బాల్స్ వేసిన బౌలర్ల జాబితాలో షమీ ఇర్ఫాన్ పఠాన్, జహీర్ ఖాన్ సరసన చేరాడు. ఇదిలా ఉంటే.. పాక్‌తో మ్యాచ్‌లో భారత్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేస్తోంది. ఆరంభంలోనే షమీ కాస్త నిరాశపరిచినా ఆ తర్వాత పాకిస్తాన్ బౌలర్లకు చుక్కలు చూపిస్తున్నాడు. మరోవైపు.. యువ పేసర్ హర్షిత్ రాణా, పేస్ బౌలింగ్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా, చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ అదరగొడుతున్నారు. ఫలితంగా పవర్‌ప్లే ముగిసే సరికి పాకిస్తాన్ నామమాత్రపు స్కోరుకే పరిమితమైంది. పది ఓవర్లు ముగిసేసరికి రెండు వికెట్లు కోల్పోయి కేవలం 52 పరుగులే చేసింది. ఇందులో బాబర్ ఆజం(23) రూపంలో హార్దిక్ పాండ్యా కీలక వికెట్ తీయగా.. కుల్దీప్ యాదవ్ బౌలింగ్‌లో షాట్ ఆడేందుకు ప్రయత్నించి విఫలమైన మరో ఓపెనర్ ఇమామ్ ఉల్ హక్ సింగిల్ తీసేందుకు ప్రయత్నించి రనౌట్ అయ్యాడు. అక్షర్ పటేల్ డైరెక్ట్ త్రో కారణంగా వికెట్ సమర్పించుకుని పది పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద పెవిలియన్ చేరాడు.

పాకిస్తాన్‌తో మ్యాచ్‌లో తొలి ఓవర్లో ఐదు వైడ్ బాల్స్ వేయడం ద్వారా షమీ పేరిట నమోదైన చెత్త రికార్డులు

-చాంపియన్స్ ట్రోఫీ చరిత్రలో ఇన్నింగ్స్ ఆరంభ ఓవర్లో అత్యధిక వైడ్‌లు వేసిన రెండో బౌలర్.

-వన్డేల్లో వైడ్స్, నో బాల్స్‌తో కలిపి తొలి ఓవర్లోనే అత్యధిక బంతులు బౌల్ చేసిన మూడో బౌలర్. ఈ జాబితాలో జహీర్ ఖాన్ వాంఖడే వేదికగా 2003లో ఆస్ట్రేలియాతో మ్యాచ్‌లో పదకొండు బంతులు వేసి ముందు వరుసలో ఉండగా.. ఇర్ఫాన్ పఠాన్ వెస్టిండీస్‌తో 2006లో కింగ్‌స్టన్ వేదికగా ఈ చెత్త గణాంకాలు నమోదు చేశాడు.

## హ్యాట్రిక్‌తో మెరిసిన ఆస్ట్రేలియా బౌలర్



మహిళల ఐపీఎల్‌లో ఆస్ట్రేలియా బౌలర్, యూపీ వారియర్జ్ ఆల్‌రౌండర్ గ్రేస్ హ్యారిస్ హ్యాట్రిక్‌తో మెరిసింది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో నిన్న (ఫిబ్రవరి 22) జరిగిన మ్యాచ్‌లో గ్రేస్ ఈ ఘనత సాధించింది. ఢిల్లీ లక్ష్యాన్ని ఛేదిస్తుండగా చివరి ఓవర్‌లో (20) గ్రేస్ హ్యాట్రిక్ నమోదు చేసింది. ఈ ఓవర్‌లో గ్రేస్ తొలి మూడు బంతులకు మూడు వికెట్లు తీసింది. తొలుత నికీ ప్రసాద్, ఆతర్వాత వరుసగా అరుంధతి రెడ్డి, మిన్నూ మణిలను ఔట్ చేసింది. హ్యాట్రిక్‌తో కలిసి గ్రేస్ ఈ మ్యాచ్‌లో నాలుగు వికెట్లు పడగొట్టింది. డబ్ల్యూపీఎల్‌లో హ్యాట్రిక్ సాధించిన మూడో బౌలర్‌గా గ్రేస్ రికార్డు సృష్టించింది. డబ్ల్యూపీఎల్ తొలి హ్యాట్రిక్‌ను లీగ్ ఆరంభ ఎడిషన్‌లో ముంబై ఇండియన్స్ బౌలర్ ఇస్సీ వాంగ్ సాధించింది. యూపీ వారియర్జ్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఇస్సీ వాంగ్ ఈ ఘనత సాధించింది. అనంతరం 2024 ఎడిషన్‌లో రెండో హ్యాట్రిక్ నమోదైంది. ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో యూపీ వారియర్జ్ బౌలర్ దీప్తి శర్మ ఈ ఘనత సాధించింది. లీగ్‌లో నమోదైన మూడు హ్యాట్రిక్స్‌లో రెండు యూపీ బౌలర్లే సాధించడం విశేషం. ఇదిలా ఉంటే, గ్రేస్‌తో (2.3-0-15-4) పాటు క్రాంతి గౌడ్ (4-0-25-4) కూడా చెలరేగడంతో ముంబైపై యూపీ 33 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన యూపీ.. చిన్నెల్ హెన్రీ సుడిగాలి అర్ధ శతకంతో విరుచుకుపడటంతో నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 177 పరుగులు చేసింది. చిన్నెల్ 23 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సర్ల సాయంతో 62 పరుగులు చేసి ఔటైంది. హాఫ్ సెంచరీ మార్కును 18 బంతుల్లో చేరుకున్న చిన్నెల్.. సోఫీ డంక్లీతో కలిసి లీగ్‌లో జాయింట్ ఫాస్టెస్ట్ ఫిఫ్టీ రికార్డును షేర్ చేసుకుంది. యూపీ ఇన్నింగ్స్‌లో చిన్నెల్ మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. తహ్లియా మెక్‌గ్రాత్ 24, కిరణ్ నవ్‌గిరే 17, దీప్తి శర్మ 13, శ్వేత సెహ్రావత్ 11, సోఫీ ఎక్లెస్టోన్ 12 పరుగులు చేశారు. ఢిల్లీ బౌలర్లలో జొనాస్సెన్ 4 వికెట్లు పడగొట్టగా.. మారిజన్ కాప్, అరుంధతి రెడ్డి తలో రెండు, శిఖా పాండే ఓ వికెట్ పడగొట్టారు. అనంతరం 178 పరుగుల లక్ష్య ఛేదనలో ఢిల్లీ తడబడింది. జెమీమా రోడ్రిగెజ్ (56) అర్ధ సెంచరీతో రాణించినప్పటికీ.. ఆమెకు మరో ఎండ్ నుంచి సహకారం లభించలేదు. ఢిల్లీ ఇన్నింగ్స్‌లో జెమీమాతో పాటు షఫాలీ వర్మ (24), నికీ ప్రసాద్ (18), శిఖా పాండే (15 నాటౌట్) మాత్రమే రెండంకెల స్కోర్లు చేశారు. ప్రస్తుత ఎడిషన్‌లో యూపీకి ఇది తొలి విజయం. ఆ జట్టు ఇప్పటివరకు ఆడిన మూడు మ్యాచ్‌ల్లో రెండింట ఓడింది. మూడు మ్యాచ్‌ల్లో తలో రెండు గెలిచిన ఆర్సీబీ, ముంబై ఇండియన్స్ టేబుల్ టాపర్లుగా ఉన్నాయి.

## చరిత్ర సృష్టించిన ఆస్ట్రేలియా.. అంచనాలు లేకుండా బరిలోకి దిగి..!

ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. ఐసీసీ వన్డే టోర్నీల్లో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగా సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఛాంపియన్స్? ట్రోఫీ-2025లో భాగంగా నిన్న (ఫిబ్రవరి 22) ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 352 పరుగుల లక్ష్యాన్ని మరో 15 బంతులు మిగిలుండగానే ఛేదించింది. ఐసీసీ టోర్నీల చరిత్రలో ఇదే అత్యధిక లక్ష్య ఛేదన. ఈ మ్యాచ్‌కు ముందు ఐసీసీ టోర్నీల్లో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన రికార్డు పాకిస్తాన్ పేరిట ఉండింది. 2023 వరల్డ్‌కప్‌లో ఆ జట్టు శ్రీలంక నిర్దేశించిన 345 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది.

### ఐసీసీ టోర్నీల్లో అత్యధిక లక్ష్య ఛేదనలు..

ఆస్ట్రేలియా 352 వర్సెస్ ఇంగ్లండ్, లాహోర్, 2025 ఛాంపియన్స్ ట్రోఫీ పాకిస్తాన్ 345 వర్సెస్ శ్రీలంక, హైదరాబాద్, 2023 వన్డే వరల్డ్‌కే ఐర్లాండ్ 329 వర్సెస్ ఇంగ్లండ్, బెంగళూరు, 2011 వన్డే వరల్డ్‌కప్

### శ్రీలంక రికార్డు బద్దలు

ఈ మ్యాచ్‌తో ఆసీస్ ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన జట్టుగానూ రికార్డు నెలకొల్పింది. గతంలో ఈ రికార్డు శ్రీలంక పేరిట ఉండింది. 2017 ఎడిషన్‌లో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో శ్రీలంక 322 పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది.

**ఛాంపియన్స్ ట్రోఫీలో అత్యధిక లక్ష్య ఛేదనలు..**

**ఆస్ట్రేలియా 352 వర్సెస్ ఇంగ్లండ్, లాహోర్, 2025**

**శ్రీలంక 322 వర్సెస్ భారత్, ద ఓవల్, 2017**

**ఇంగ్లండ్ 308 వర్సెస్ బంగ్లాదేశ్, ద ఓవల్, 2017**

**ఆసీస్ వన్డే హిస్టరీలో రెండో అత్యుత్తమ లక్ష్య ఛేదన**

ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా ఛేదించిన 352 పరుగుల లక్ష్యం, ఆ దేశ వన్డే హిస్టరీలోనే రెండో అత్యధికం. వన్డేల్లో ఆసీస్ అత్యుత్తమ లక్ష్య ఛేదన 2013లో రికార్డైంది. అప్పట్లో భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆసీస్ 359 పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది.

### పాక్ గడ్డపై రెండో అత్యధిక ఛేదన

ఈ మ్యాచ్‌లో ఆసీస్ ఛేదించిన లక్ష్యం?.. పాక్ గడ్డపై రెండో అత్యధికం. పాక్‌లో అత్యధిక లక్ష్యాన్ని ఛేదించిన ఘనత పాక్ ఖాతాలోనే ఉంది. కొద్ది రోజుల కిందట సౌతాఫ్రికాతో జరిగిన మ్యాచ్‌లో పాక్ 355 పరుగుల లక్ష్యాన్ని విజయవంతంగా ఛేదించింది. వన్డేల్లో ఇదే పాక్‌కు అత్యధిక లక్ష్య ఛేదన.దమ్యాచ్ విషయానికొస్తే.. ఇంగ్లిస్ (120 నాటౌట్) మెరుపు సెంచరీతో కదంతొక్కడంతో ఇంగ్లండ్ నిర్దేశించిన 352 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆసీస్ మరో 15 బంతులు మిగిలుండగానే ఊదేసింది. స్టార్ ప్లేయర్ల గైర్హాజరీలో ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన ఆసీస్.. రికార్డు లక్ష్యాన్ని ఛేదించి వరల్డ్ ఛాంపియన్స్ అనిపించుకుంది. ఈ మ్యాచ్‌కు ముందు ఆసీస్.. శ్రీలంక చేతిలో 0-2 తేడాతో వన్డే సిరీస్‌ను కోల్పోయింది.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్.. బెన్ డకెట్ (143 బంతుల్లో 165బీ 17 ఫోర్లు, 3 సిక్సర్లు) శతక్కొట్టడంతో నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 351 పరుగులు చేసింది. జో రూట్ (68) అర్ధ శతకంతో రాణించాడు. ఆఖర్లో జోఫ్రా ఆర్చర్ (10 బంతులోల? 21 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో ఇంగ్లండ్ 350 పరుగుల మార్కును తాకగలిగింది. ఆసీస్ బౌలర్లలో డ్వార్షుయిష్ 3, లబూషేన్, జంపా తలో 2, మ్యాక్స్‌వెల్ ఓ వికెట్ పడగొట్టారు. అనంతరం భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆస్ట్రేలియా.. 47.3 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. జోస్ ఇంగ్లిస్ మెరుపు శతకంతో విజృంభించి ఆసీస్‌ను విజయతీరాలకు చేర్చాడు. మాథ్యూ షార్ట్ (63), అలెక్స్ క్యారీ (69), లబూషేన్ (47), మ్యాక్స్‌వెల్ (32 నాటౌట్) ఇంగ్లిస్‌కు సహకరించారు. ఇంగ్లండ్ బౌలర్లలో వుడ్, ఆర్చర్, కార్స్, రషీద్, లివింగ్‌స్టోన్ తలో వికెట్ తీశారు.




## కోహ్లీ 100 నాటౌట్.... పాక్ పై భారత్ చిరస్మరణీయ విజయం

ఐసీసీ ఈవెంట్లలో పాక్ పై ఆధిపత్యాన్ని నిలుపుకున్న భారత్

ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్ లో ఘనవిజయం

6 వికెట్ల తేడాతో పాక్ ను ఓడించిన టీమిండియా

111 బంతుల్లో 100 పరుగులు చేసిన కోహ్లీ

రాణించిన శ్రేయాస్ అయ్యర్, శుభ్ మన్ గిల్



ఐసీసీ మేజర్ ఈవెంట్లలో పాకిస్థాన్ పై తన ఆధిపత్యాన్ని భారత్ మరోసారి ఘనంగా చాటుకుంది. ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్-ఏలో నేడు జరిగిన లీగ్ మ్యాచ్ లో భారత్ చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసింది. బ్యాటింగ్ కింగ్ విరాట్ కోహ్లీ (100 నాటౌట్) అద్భుత సెంచరీ సాధించిన వేళ... టీమిండియా 6 వికెట్ల తేడాతో పాక్ ను చిత్తు చేసింది. ఈ విజయంతో భారత్ సెమీస్ బెర్తును దాదాపు ఖాయం చేసుకుంది. దుబాయ్ లో జరిగిన ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన పాక్ మొదట బ్యాటింగ్ ఎంచుకుంది. టీమిండియా బౌలర్లు విజృంభించడంతో పాక్ 49.4 ఓవర్లలో 241 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం, 242 పరుగుల లక్ష్యఛేదనలో టీమిండియా సునాయాసంగా విజయాన్ని అందుకుంది. కేవలం 4 వికెట్లు కోల్పోయి 42.3 ఓవర్లలో 244 పరుగులు చేసింది. టీమిండియా ఇన్నింగ్స్ కు వెన్నెముకలా నిలిచిన కోహ్లీ 111 బంతుల్లో సరిగ్గా 100 పరుగులు చేశాడు. కోహ్లీ ఇన్నింగ్స్ లో 7 ఫోర్లు ఉన్నాయి. విన్నింగ్ షాట్ ఫోర్ కొట్టిన కోహ్లీ అటు సెంచరీ పూర్తి చేసుకోవడమే కాకుండా, ఇటు జట్టుకు విజయాన్ని అందించాడు. కోహ్లీకిది వన్డేల్లో 51వ సెంచరీ కాగా, పాకిస్థాన్ పై నాలుగోది. అంతకుముందు, కెప్టెన్ రోహిత్ శర్మ 15 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్ తో 20 పరుగులు చేశాడు. మరో ఓపెనర్ శుభ్ మన్ గిల్ 46, శ్రేయాస్ అయ్యర్ 56 పరుగులు చేశారు. హార్దిక్ పాండ్యా 8 పరుగులకే వెనుదిరిగినా... అక్షర్ పటేల్ (3 నాటౌట్) తో కలిసి కోహ్లీ మిగతా పని పూర్తి చేశాడు. పాక్ బౌలర్లలో షహీన్ అఫ్రిది 2, అబ్రార్ అహ్మద్ 1, కుష్ దిల్ షా 1 వికెట్ తీశారు. ఛాంపియన్స్ ట్రోఫీ గ్రూప్ దశలో టీమిండియాకు ఇది వరుసగా రెండో విజయం కాగా... పాకిస్థాన్ కు వరుసగా రెండో ఓటమి. ఈ ఓటమితో పాక్ సెమీస్ అవకాశాలు బాగా దెబ్బతిన్నాయి. గ్రూప్-ఏలో తాను ఆడిన రెండు మ్యాచ్ ల్లో విజయాలతో టీమిండియా టాప్ లో ఉంది. పాక్ అట్టడుగున ఉంది. రెండో స్థానంలో న్యూజిలాండ్, మూడో స్థానంలో బంగ్లాదేశ్ ఉన్నాయి. టీమిండియా తన చివరి లీగ్ మ్యాచ్ ను న్యూజిలాండ్ తో మార్చి 2న ఆడనుంది.

Editor,Printer,Publisher,Owner By:Kotlapalli Fouziya,Printed At by M/s Fouziya Publication,Door No:26-4-1273/3,Melapuram,Hindupur.Sri Sathya Sai district, Andrapradesh - 515201, bharathreporter@gmail.com,Cell: 9059679786 RNI No.APTEL/ 2023/88573.